ఆంధ్రజ్యోతి


****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 16 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	225	245
సూర్యాపేట	రూ.150	210	240
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 , కనిష్ఠం 24.0



నాగార్జునసాగర్ పార్క్‌లో ఎండిన గడ్డి

ఆంధ్రజ్యోతి విజిట్

ఆహ్లాదం.. ఆమడ దూరం

- మునిసిపాలిటీల్లో అధ్వానంగా పార్క్‌ల నిర్వహణ
- పచ్చదనం కనుమరుగు
- పలుచోట్ల దెబ్బతిన్న క్రీడాసామగ్రి
- అసౌకర్యాలతో కానరాని సందర్శకులు

నిత్యం ఉరుకులు.. పరుగులతో గడిపే పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, కాస్త ఆహ్లాదం అందించేందుకు పురపాలికలు గతంలో పార్కులను ఏర్పాటుచేశాయి. ఉదయం,సాయంత్రం వాకింగ్‌తోపాటు పిల్లల ఆటలు,సేద తీరుతున్న పెద్దలతో నిత్యం సందడిగా ఉండేవి. ప్రస్తుతం ఈ పార్కుల నిర్వహణను పురపాలికలు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. కొన్ని పార్కుల్లో అసలు పచ్చదనమే కరువై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మరికొన్ని చోట పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన క్రీడాసామగ్రి దెబ్బతిని నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత వేసవిలో ప్రజలు ఉపశమనం పొందేందుకు పచ్చని పార్కులు కరువయ్యాయి. ఇప్పటికైనా మునిసిపాలిటీ అధికారులు పట్టించుకొని పార్కులను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● వివరాలు 6లో..



కనగల్ మండలం వెలకంటిగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన లబ్ధిదారుడు

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా..

- ఇందిరమ్మ ఇంటికి ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి
- నియోజకవర్గానికో స్పెషలాఫీసర్ నియామకం
- 360 డిగ్రీ సర్వే నిలిపివేసి, క్షేత్రస్థాయి పరిశీలన చేయాలనే డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల సమావేశంలో సూచించారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను జాగ్రత్తగా రూపొందించాలని, అర్హులకే పథకం వర్తించేలా చూడాలని సమావేశంలో సీఎం సూచించారు. జిల్లా స్థాయిల్లో ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందాకే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేయాలని నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున తొలివిడత ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నారు. అందుకు ఇప్పటికే ప్రజాపాలనలో, ఇటీవల మీ-సేవా కేంద్రాల ద్వారా అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మినహా ప్రస్తుతం స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అర్హుల జాబితా రూపకల్పనలో వారి అభిప్రాయాలకు అధికారులు తప్పకుండా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అర్హుల ఎంపికలో ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లకు లోనుకావద్దని, పూర్తి పారదర్శకంగా అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రతీ నియోజకవర్గానికి స్పెషలాఫీసర్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించాలని నిర్ణయించారు. అదేవిధంగా నాలుగైదు గ్రామాలకు కలిపి ఒక క్లస్టర్‌గా రూపొందించి ఒక మండల స్థాయి అధికారిని క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించి అర్హుల జాబితా రూపొందించాలని ప్రభుత్వం సూచించింది. మండల స్థాయి ఇందిరమ్మ కమిటీలు అందించే జాబితాలను క్లస్టర్ కమిటీలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి జాబితా రూపొందిస్తాయి. ఈనెల 17లోగా ప్రజాప్రతినిధులతో చర్చించి, నియోజకవర్గాల్లో ఏ గ్రామానికి ఎన్ని ఇళ్లు కేటాయించాలనే విషయాన్ని కలెక్టర్లు నిర్ధారిస్తారు. ఆ తరువాత 21వ తేదీ వరకు క్లస్టర్ స్థాయిలో ఇన్‌చార్జి అధికారులు అర్హుల జాబితాలు పరిశీలించి నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అందజేస్తారు. 22 నుంచి 30వ తేదీ వరకు నియోజకవర్గ ఇన్‌చార్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను కలెక్టర్‌కు నివేదిస్తారు. మే 1న అన్ని మునిసిపల్ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో అర్హుల జాబితాలను ప్రదర్శిస్తారు. మే 2 నుంచి 4వ తేదీ వరకు కలెక్టర్ల ఆధ్వర్యంలో మరోసారి జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్పెషలాఫీసర్లు, జిల్లా స్థాయి స్పెషలాఫీసర్లతో చర్చించి తుది జాబితాను ఖరారు చేస్తారు. చివరగా ఇన్‌చార్జి మంత్రి పరిశీలించి ఆమోదించిన తర్వాత మే 5 నుంచి 7వ తేదీ లోపు లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ ఆమోదించి ఇళ్లను మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సీఎం, మంత్రులు స్పష్టంగా ఆదేశించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరగకుండా అప్రమత్తమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు

మిగతా 7వ పేజీలో...

360 డిగ్రీల సర్వే పేరుతో అనర్హులకు జాబితాలో చోటు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి తొలగించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ప్రజాపాలన దరఖాస్తులతో పాటు, ఇటీవల ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు తీసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తికాలేదని అధికారు లు చెబుతున్నా, మరోవైపు ఇటీవల ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు జాబితా పంపాలనే ఆదేశాలతో మునిసిపల్ అధికారులు, ఎంపీడీవోలకు వచ్చిన జాబితాల్లో అనర్హుల పేర్లున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. నల్లగొండ, దేవరకొండ, హాలియా, నకిరేకల్ మునిసిపాలిటీతోపాటు పలు గ్రామాల్లో ఈ పరిస్థితి వెలుగులోకి వచ్చింది. 360 డిగ్రీల కోణంలో దరఖాస్తులు పరిశీలించి అర్హుల జాబితా తయారు చేస్తున్నామని చెబుతున్న అధికారులు, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేయకుండానే అర్హుల జాబితా తయారు చేశారని, దీంతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. రేషన్‌కార్డు, ఆధార్‌నెంబర్ ఆధారంగా గతంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా హౌసింగ్ పథకాలు పొందకపోతే వారిని అర్హులుగా పేర్కొంటూ జాబితాల్లో చేర్చారని, కానీ వారికి రేషన్‌కార్డులున్నా, వ్యవసాయభూమి లేకపోయినా ప్లాట్లు, సొంత ఇళ్లు ఉన్నాయని, క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేస్తే ఈ విషయాలు బయటపడతాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు ఈ విషయనాలను పట్టించుకోకుండా ఆన్‌లైన్‌లోనే పరిశీలించి అర్హుల జాబితా తయారు చేస్తుండటంతో గ్రామాల్లో, మునిసిపల్ వార్డుల్లో అనర్హులు లబ్ధిపొంది, అర్హులు పథకానికి దూరమవుతారని కాంగ్రెస్ నేతలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సన్నబియ్యం బాగున్నాయా?

- విద్యార్థులకు రక్త పరీక్షలు చేయిస్తున్నారా?
- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి
- దేవరకొండ డివిజన్‌లో తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు

దేవరకొండ/కొండమల్లేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీచేస్తున్న సన్నబియ్యం బాగున్నాయా? విద్యార్థులకు రక్త పరీక్షలు చేయిస్తున్నారా? ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. మంగళవారం కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాల్లో జాతీయ ఆహారభద్రత చట్టం అమలు తీరును కమిటీ సభ్యులు శారద, భారతి, జ్యోతి, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రేషన్ దుకాణం, దోన్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కొండభీమనపల్లి మైనార్టీగురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, దేవరకొండ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం, ప్రభుత్వ ఆసుపత్రిని వారు తనిఖీచేశారు. కొండమల్లేపల్లి 3వ నెంబర్ చౌకధరల దుకాణాన్ని తనిఖీచేసి రేషన్‌బియ్యం సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలన్నారు. తన దుకాణానికి ప్రతీ నెల 196 క్వింటాళ్ల బియ్యం దిగుమతి అవుతోందని, గతంలో ప్రజలకు పంపిణీ చేసేందుకు 15 రోజుల సమయం పట్టేదని, సన్న బియ్యం కావడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపి వస్తుండటంతో నాలుగు రోజులోనే పంపిణీ పూర్తవుతోందని డీలర్ వివరించారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారులతో కమిషన్ సభ్యులు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల వివరాలు, పౌష్టికాహారం, పాలు, గుడ్లు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఇక్కడ వెయ్యి మంది విద్యార్థులు విద్యనభ్యసించడం అభినందనీయమన్నారు. వంట గది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. దేవరకొండ పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసి వసతి గృహ విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించాలన్నారు.

దేవరకొండలో ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల నుంచి 200 పడకలకు మార్చే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. దేవరకొండ గురుకులంలోనికి కొందరు ఆకతాయిలు రాత్రివేళ వచ్చి విద్యార్థులను భయాందోళనకు గురిచేశారనే సమాచారం ఉందని, ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిర్యాదుల పెట్టే నిర్వహణ తీరు సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. దోన్యాల అంగన్‌వాడీ కేంద్రంలో రుచికరంగా వంట చేయాలని సూచించారు. వారి వెంట డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, శిశుసంక్షేమశాఖ పీడీ కృష్ణవేణి, డీఈవో భిక్షపతి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి చక్రునాయక్, హరీష్, దేవరకొండ, కొండమల్లేపల్లి తహసీల్దార్ సంతోష్‌కిరణ్, అన్వర్ హుస్సేన్, ఎంపీడీవో డానియెల్, బాలరాజురెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఆహార కమిషన్‌కు కలెక్టర్ స్వాగతం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు శారద, భారతి, జ్యోతికి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో జిల్లాలో ఆహార భద్రతా కింద అమలవుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అంతా మోసపోయారు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



జెండా ఊపి పాదయాత్ర ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రైతులు, కూలీలు, కార్మికులు, మహిళలు అంతా మోసపోయారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలంలోని అరూరు గ్రామపరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు చేపట్టిన పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయాన్ని నాశనం చేసిందని, రైతులు ఏడుస్తున్నారని తెలిపారు. గాంధీ చూపిన అహింసా మార్గంలోనే తెలంగాణ ఉద్యమాన్ని నడిపి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనకిచ్చిన ఆర్టికల్ 3ను ఉపయోగించుకొని తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న నిరంహించ తలపెట్టిన సభ విజయవంతం కావాలని ఈ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపడానికి విద్యార్థి, యువజన సంఘం నాయకులు ముందుకు రావడం అభినందీయనమన్నారు. వరంగల్ సభకు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. పాదయాత్రలో బీఆర్ఎస్‌వై యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వల్లమాల్ల కృష్ణ, బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బూరుగు నవీన్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఆస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురకంటి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, పనుమటి మమత-నరేందర్‌రెడ్డి, మట్ట ధనుంజయ్య గౌడ్, జానీ అఫ్రోజ్, పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీపై తప్పుడు ప్రచారం చేస్తే కేసు నమోదు చేస్తాం

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నల్లగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకంపై తప్పుడు ప్రచారం చేస్తే కేసు నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తి చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం బదులు ప్లాస్టిక్ బియ్యం సరఫరా చేస్తున్నారని వీడియోను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయాన్ని గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ సన్నబియ్యంపై ఎవరైనా నిరాధార ఆరోపణలు ప్రచారం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుంచి స్పందన ఉందని, ప్రజలందరూ సంతోషంగా సన్నబియ్యాన్ని తీసుకుంటున్నారని అన్నారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు కొంతమంది సోషల్ మీడియాలో చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో సహించదన్నారు.

10 రోజుల్లో నిర్వాసితులకు పునరావాసం: ఆర్డీవో

మర్రిగూడ,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపు బాధిత భూ నిర్వాసితులకు 10 రోజుల్లో పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కల్పిస్తామని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలో ముంపు బాధితులతో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్ పనులు చేపడుతున్నందున్న 390మంది ఇళ్లను కోల్పోయారన్నారు. వారికి పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తామని అన్నారు. ప్రస్తుతానికి పనులు జరగనివ్వాలని కోరారు. అనంతరం నిర్వాసితులతో తీర్మానం చేయించి వినతిపత్రం తీసుకున్నారని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో యరకల యాదయ్య, గుర్రం రజిత, పారిజాత, వల్లపు కేశవులు, శ్రీను, నిరంజన్, నర్సింహ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి



ధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు ప్రభావతి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఆరేళ్లుగా నిరుపేదలకు వితంతు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ ఇవ్వడం లేదని, దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడంతో సభ్యురాలు మృతిచెందితే ఆ భారం గ్రూప్ సభ్యులపై పడి సంఘాలు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయన్నారు. ప్రభుత్వమే ప్రతీ మహిళకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. అర్హులైన పేదలు కొన్నేళ్లుగా దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని,కనీసం చేర్పులు, మార్పులకు కూడా అవకాశం ఇవ్వడం లేదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు, సన్న బియ్యం అందాలంటే రేషన్‌కార్డులు తప్పనిసరి చేశారని, అయితే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, నిమ్మల పద్మ, జిల్లా ఆఫీస్ బేరర్స్ భూతం అరుణకుమారి, తుమ్మలా పద్మ, సుల్తానా, ఊర్మిళ, అరుణ, ఇందిర, శశికళ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పోలీస్ అధికారులతో సమస్యల పరిష్కారం

ఎస్పీ శరత్‌చంద్రపవార్

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పోలీస్ అధికారుల సేవలతో ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాల ఏర్పాటుతోనే నేరనియంత్రణ సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే అనుమానితుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలు విలేజ్ పోలీస్ అధికారికి అందించాలన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా గానీ, మెసేజ్ ద్వారా గానీ వ్యక్తిగత సమాచారం అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. యువత మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రైతులకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



చిట్యాలలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిసాన్‌మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి

బీజేపీ కిసాన్‌మోర్చా నేత గోలి మధుసూదన్‌రెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతులకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నేత గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా సంపూర్ణంగా అమలు చేయాలని, అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫసల్‌బీమా పథకాన్ని అమలు చేయాలని, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, గోనె సంచులు సరిపడా లేవన్నారు. లారీల సమస్య, హమాలీల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వెంటను రైతుల ఖాతాలో డబ్బు జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నాయకులు కన్నెబోయిన మహలింగం, గుడిగుంట్ల సాయన్న, మండల వెంకన్న, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, మిర్యాల వెంకన్న, అంశాల అనిల్‌కుమార్, జయారపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండాయి, ఆట వస్తువులు పగిలాయి



దేవరకొండ ఖిల్లాలో ఏర్పాటు చేసిన పార్క్

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ): నల్లగొండ జిల్లా దేవరకొండ మునిసిపాలిటీలో 2020-22లలో పట్టణంలో పార్క్‌లు, ఓపెన్‌జిమ్‌లు ప్రారంభించారు. కానీ సరైన నిర్వహణ లేకపోవడంతో పార్క్‌ల్లోని క్రీడాసామగ్రి ధ్వంసమైంది. సంజయ్‌కాలనీ, బంజారాభవన్, ముత్యాలమ్మబజార్‌లో పార్క్‌లు నిర్మించారు. అందులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, చిన్నపిల్లల కోసం ఆటసామగ్రి, అందమైన పూలమొక్కలు, వ్యాయమ పరికరాలు ధ్వంసమయ్యాయి. మొక్కలకు నీరు అందక ఎండిపోయాయి.

ఖిల్లాలో పార్క్‌లో సౌకర్యాలు, భద్రత కరువు

సుదీర్ఘ చరిత్ర కలిగిన దేవరకొండ ఖిల్లాలో ఐదు ఎకరాలలో రూ.5 కోట్లతో పార్క్ నిర్మించారు. ఈ పార్క్‌కు పర్యాటకుల రద్దీ ఉన్నా తాగునీటి సౌకర్యం కల్పించలేదు. క్యాంటిన్, ఫుడ్‌కోర్ట్ ఏర్పాటుచేయకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీ కెమెరాలు లేక పర్యాటకులకు భద్రతా లేకుండా పోయిందని స్థానికులు తెలిపారు. సెక్యూరిటీని నియమించాలని పర్యాటకులు కోరుతున్నారు.

త్వరలో ఏర్పాటు చేస్తాం

దేవరకొండ ఖిల్లాలోని పార్క్ నిర్వహణ ప్రస్తుతం మునిసిపాలిటీ నిర్వహిస్తోంది. నలుగురు ఉద్యోగులు పనిచేస్తున్నారు. పార్క్‌కు పర్యాటకుల రద్దీ పెరిగింది. త్వరలో టెండర్లు పిలిచి ఫుడ్‌కోర్టు ఏర్పాటుచేసి సౌకర్యాలు కల్పిస్తాం. సీసీ కెమెరాలు బిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పర్యాటకులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం.

- సుదర్శన్, దేవరకొండ మున్సిపల్ కమిషనర్

తిరుమలగిరిలోనూ..

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి): అధికారుల పర్యవేక్షణ లోపంతో పట్టణ ప్రకృతి వనాలు(పార్క్‌లు) అస్తవ్యస్తంగా మారాయి. కనీసం చెత్త తొలగించకపోవడంతో, చెట్లు కత్తిరించకపోవడంతో చిన్నఅడవిని తలపిస్తున్నాయి. చెట్లకు నీళ్లు పోసే నాథుడే లేక చెట్లన్నీ ఎండిపోతున్నాయి. ఆయా కాలనీల్లోని ప్రజలు ఉదయం-సాయంత్రం నడవడానికి దారి కూడా లేకపోవడంతో పార్క్ వైపు కన్నెత్తి చూడటం లేదు. మునిసిపల్ పరిధిలో మొత్తం 12 పార్క్‌ల పరిస్థితి ఒకేలా ఉంది. కొన్నిచోట్ల గేట్లు విరిగాయి. మరికొన్ని తాళాలు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాలుగా మారాయి.



విషసర్పాలకు నిలయంగా...

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్): యాదగిరిగుట్ట పట్టణంలోని పార్క్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో విషసర్పాలకు ఆవాసంగా మారుతున్నాయి. రెండేళ్ల కిందట మూడు పార్క్‌లను ఏర్పాటుచేయగా, నిర్వహణ లోపంతో అధ్వానంగా మారాయి. ఈ పార్క్‌ల కోసం ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. దాంతో సదరు కాంట్రాక్టర్ అన్ని పరికరాలు, మొక్కలు, విశ్రాంతి కోసం సిమెంట్ బెంచీలను, పిల్లలకు కావాల్సిన ఆట వస్తువులను పూర్తిగా సమకూర్చకుండా నామమాత్రంగా ఏర్పాటుచేశారు. 45 రోజుల నుంచి మొక్కులకు నీటి సరఫరా లేక ఎండతీవ్రతకు ఎండిపోయాయి. మరోవైపు శుభ్రం చేయకపోవడంతో రాలిన ఆకులలో ఆవరణ చెత్తకుప్పగా మారుతోంది. దీంతో పార్క్ పందికొక్కులు, పాములకు స్థావరంగా మారింది. దీంతో ప్రజలు అక్కడికి వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా పార్క్ నిర్వహణను చూస్తున్న సిబ్బందికి మూడు నెలల వేతనాలు బకాయి ఉన్నాయి. ఇదిలా ఉండగా తాము వేతనాలు బకాయి లేమని కాంట్రాక్టర్ ప్రసాద్ తెలిపారు.



పార్క్‌లో రాలిన ఆకులతో చెత్తకుప్ప

పార్కుల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగిస్తాం



పట్టణంలోని మూడు పార్క్‌ల నిర్వహణ బాధ్యతలను వారం కిందట మునిసిపాలిటీకి అప్పగించారు. పార్క్‌ల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించి వాటి పరిశుభ్రత కాపాడేలా చర్యలు తీసుకుంటాం. పార్క్‌లలో దట్టంగా పెరిగిన చెట్లపొదలను, చెత్తను పూర్తిగా తొలగించి విషసర్పాలకు స్థావరంగా లేకుండా ప్రజలు సంతోషంగా వెళ్లేలా అవకాశం కల్పిస్తాం.

- అజయ్‌కుమార్‌రెడ్డి. కమిషనర్, యాదగిరిగుట్ట

ఆహ్లాదం..ఆమడదూరం

» మునిసిపాలిటీల్లోని పార్క్‌ల నిర్వహణ అధ్వానం » పచ్చదనం కనుమరుగు » పలుచోట్ల దెబ్బతిన్న క్రీడాసామగ్రి » అసౌకర్యాలతో కానరాని సందర్శకులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్క్‌ల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రజలకు ఏమాత్రం ఉపయోకరంగా లేవు. దీంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోతుండగా, ప్రజలకు వేసవిలో ఉపశమనం పొందేందుకు స్థలం అంటూ లేకుండా పోయింది.

మిర్యాలగూడలోని సుందరయ్య పార్క్‌లో నీటివసతి లేక కళతప్పిన ఫౌంటెన్

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని పార్క్‌లు నిర్వహణ లోపంతో బోసిపోతున్నాయి. ఎన్నెస్పీ క్యాంప్‌లోని సుందరయ్య పార్క్, హౌజింగ్ బోర్డులోని రెండు పార్క్‌లు, చైతన్యనగర్‌లోని బోటింగ్ ప్రాంతంలో మరో పార్క్, షాబూనగర్, ఇందిరమ్మ కాలనీల్లో ఒకటి చొప్పున మూడు పార్కులున్నాయి. అయితే ఆయా పార్క్‌లలో పచ్చిక బయళ్లు, వాకింగ్ ట్రాక్‌లు లేకపోవడం, ఓపెన్‌జిమ్‌లలో వ్యాయామ పరికరాలు ధ్వంసం కావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అరకొర వసతులుండటంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. సుందరయ్య పార్క్‌కు రద్దీ ఉంటుంది. నిత్యం నడక, వ్యాయామానికి వచ్చే వారి సంఖ్య గణనీయంగానే ఉంటుంది. అయితే పార్క్‌లో మూత్రశాలలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. నీటి సౌకర్యం లేక ఫౌంటెన్లు కళతప్పాయి. ఇక మిగతా పార్క్‌లలో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన క్రీడాసామగ్రి, పెద్దవారి కోసం ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు ధ్వంసమయ్యాయి. ఇదిలా ఉండగా పార్క్‌ల నిర్వహణకు ప్రజల సహకారం అవసరమని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. వ్యాయమ పరికరాలను నిర్లక్ష్యంగా వినియోగించవద్దని సూచించారు.

నెహ్రూ పార్కు ఒక్కటే మునిసిపాలిటీకి సంబంధం

సాగర్(నందికొండ) మునిసిపాలిటీలో హిల్‌కాలనీలోని నెహ్రూ పార్క్ ఒక్కటే ఎన్ఎస్పీ అధికారులు మునిసిపాలిటీకి అప్పగించారు. మిగిలిన అన్ని పార్క్‌లు ఎన్ఎస్పీ నిర్వహణలోనే ఉన్నాయి. నెహ్రూ పార్కు తాళం కూడా మా దగ్గర లేదు.

- శ్రీను, కమిషనర్, సాగర్

నిర్వహణ లోపంతోనే



పార్క్‌ల నిర్వహణలో లోపం కనిపిస్తోంది. సుందరయ్య పార్క్‌లో సమస్యలు ఎక్కువ. నడక, వ్యాయామం, ఆహ్లాదం కోసం వస్తుంటారు. నీటి సౌకర్యం లేక ఫౌంటేన్లు కళ తప్పగా, పచ్చదనం తగ్గుతోంది. వేసవి సెలవుల్లో పార్క్‌లకు చిన్నారులు అధికంగా వస్తుంటారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వసతులు కల్పించాలి.

- చేగొండి మురళీయాదవ్, ఎన్నెస్పీ క్యాంప్, మిర్యాలగూడ.



సూర్యాపేటలోని అంబేద్కర్‌నగర్‌లోని పార్క్‌లో నిరుపయోగంగా ఆటవస్తువులు

రూ.లక్షలు వెచ్చించినా...

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటటౌన్)

సూర్యాపేట జిల్లాకేంద్రంలో పార్క్‌లు ఆహ్లాదాన్ని దూరంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రజల ఆదరణ నోచుకోవడంలేదు. ఆటవస్తువులు విరిగి, గడ్డి లేకుండ మైదానాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల కు ఉపయోగపడడంలేదు. అసలే వేసవిలో కాసేపు పార్క్‌లో పిల్లలతో సేదతీరుదామన్నా పట్టణ ప్రజలకు నిరాశే మిగులుతుంది.అంబేద్కర్‌నగర్‌లో అమృత్ పథకం నిధులు రూ. 25లక్షలతో పార్క్‌ను నిర్మించారు. నిర్మించిన కొద్దిరోజులకే ఆటవస్తువులు తుప్పపట్టి విరిగిపోయాయి. అదేవిధంగా ఇందిరమ్మకాలనీలో రూ.50 లక్షలతో రెండు చోట్లు, ఎన్‌టీఆర్ కాలనీలో రెండు చోట్ల, గణేష్‌నగర్‌లో ఒకటి, ప్రియాంక కాలనీలో, అలంకార్ థియేటర్ ప్రాంతంలో, ఇందిర పార్క్ వద్ద, జమ్మిగడ్డ వద్ద ఉన్న పార్క్‌లు ఏఒక్కటీ పూర్తి స్థాయిలో ఉపయోగపడడంలేదు.



పచ్చదనమే లేని పిల్లర్ పార్కు

పర్యాటక ప్రదేశంలోనూ అదే తీరు..

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్): ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్‌కు దేశ, విదేశాల నుంచి నిత్యం పర్యాటకులు వస్తుంటారు. అయితే ఇక్కడ ఆహ్లాదంగా గడపాలని వచ్చిన వారి ఆశలు అడియాసలవుతున్నాయి. సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో నెహ్రూ పార్క్, డౌన్ పార్క్, చిల్డ్రన్ పార్క్, శివం పార్క్, పిల్లర్ పార్క్‌లను ఏర్పాటుచేశారు. ఒకప్పుడు వీటిలో సినిమా షూటింగ్‌లు జరిగేవి. కానీ ప్రస్తుతం అధ్వానంగా తయారై కళ తప్పాయి. పుష్కరాల సమయంలో 2016లో రూ.4కోట్లతో పార్క్‌ల సుందరీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగ పనులు చేసి వదిలేశారు. అప్పటి నుంచి పార్క్‌లలో మచ్చుకైన పచ్చగడ్డి కనబడటం లేదు. సాగర్‌కు వచ్చే పర్యాటకులు మధ్యాహ్న భోజనం కుటుంబ సభ్యులతో కలిసి చేయాలన్నా ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్ల నీడలో చేయాల్సిన దుస్థితి నెలకొంది.

గేట్ తాళం తీయలే

సాగర్‌లోని పార్క్‌ల పరిస్థితి 'రెంటికి చెడ్డ రేవడి' అన్న చందంగా తయారైంది. ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ కాలనీలు, తాగునీరు, పార్క్‌లు, విద్యుత్ నిర్వహణ అంతా ఎన్నెస్పీ పరిధిలో ఉండేది. 2018లో టీఆర్ఎస్ ప్రభుత్వం నాగార్జునసాగర్‌ను నందికొండ మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. నాటి నుంచి కాలనీల్లో విద్యుత్‌ను ట్రాన్స్‌కో అప్పగించారు. కానీ తాగునీటి సరఫరా, పార్క్‌ల నిర్వహణ, నివాస గృహాల అద్దె వసూళ్లు అన్ని ఎన్నెస్పీ పరిధిలోనే ఉన్నాయి. మునిసిపాలిటీకి పైసా ఆదాయం లేకపోవడంతో అభివృద్ధి అంత కుంటుపడింది. ఇటు ఎన్నెస్పీ, అటు మునిసిపాలిటీ వారు పట్టించుకోకపోవడంతో పార్క్‌ల పరిస్థితి అధ్వానంగా తయారైందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిల్‌కాలనీలోని నెహ్రూ పార్క్‌ను ఎన్నెస్పీ వారు రెండేళ్ల కిందట మునిసిపాలిటీకి అప్పగించారు. కానీ వారు పార్క్ గేటు తాళం కూడా తీయలేదు. దీంతో పార్క్‌లో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది.



ఒక్క పార్క్‌తోనే సరి..

(ఆంధ్రజ్యోతి-కోదాడ)



సూర్యాపేట జిల్లా కోదాడలో జనాభాకు అనుగుణంగా పార్క్‌లు లేవు. సుమారు 70వేలు ఉండగా రెండు పార్క్‌లు మాత్రమే ఉన్నాయి. గాంధీ పార్క్ స్థలం చిన్నది కావడంతో పట్టణవాసులు అక్కడకు వెళ్లటానికి ఇష్టపడటం లేదు. గత ప్రభుత్వ హయంలో కోదాడ పెద్దచెరువుపై పార్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన కార్యారూపం దాల్చలేదు. దీంతో విశాలంగా ఉత్తమ్‌పద్మావతినగర్‌లోని పార్క్‌కు పరిమితం కావాల్సి వస్తోంది. అందులో మౌలిక వసతులు ఉన్నా సరిపడా లేకపోవటంతో కొంత ఇబ్బందులు పడాల్సివస్తుంది. మరికొన్ని చోట్ల పార్క్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఏడేళ్లయినా పార్క్ ఏర్పాటుకాలేదు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీలో పార్క్‌లు లేవు. మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి ఏడేళ్ల అవుతున్నా పార్క్ ఏర్పాటుచేయలేదు. రోజంతా వ్యక్తిగత పనుల ఒత్తిడిలో ఉండే ప్రజలు మానసిక ప్రశాంతత, ఉల్లాసం కోసం పార్క్‌లకు వెళదామన్నా, పిల్లలను సరదా బయటకు తీసుకెళ్లి ఆడించాలని అవకాశం లేకుండాపోయింది. బీఆర్ఎస్ హయాంలో మినీట్యాంకుబండ్, పార్క్ ఏర్పాటుకు నిధులుమంజూరు కాగా, చెరువుకట్ట రోడ్డు కొంతవెడల్పు చేసి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వాటివెంట కంపచెట్లు పెరగడం, లైటింగ్ ఏర్పాటు లేకపోవడంతో ట్యాంక్‌బండ్ శోభలేకుండాపోయింది.

మోత్కూరులో పార్కు అవసరం

మోత్కూరులో పార్క్ అవసరం ఉంది. కుటుంబ సభ్యులతో కాసేపు సరదాగా గడపుదామన్నా, వ్యాయమం చేద్దామన్నా పార్క్ లేదు. దీంతో వాకింగ్ చేసే వారు రోడ్డువెంట వెళ్లాల్సి వస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలి.

మన్నెం అంజయ్య, రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్, మోత్కూరు

చిట్యాలలో..

(ఆంధ్రజ్యోతి-చిట్యాల)

నల్లగొండ జిల్లా చిట్యాల మునిసిపల్ కేంద్రంలో పార్క్ ఇంకా నిర్మాణం కాలేదు. రెండేళ్ల కిందట ఓ వెంచర్‌లోని భూమిలో రూ.30లక్షలతో పార్క్ పనులు చేపట్టినప్పటికీ పూర్తి చేయలేదు.



● ప్రహరీ నిర్మించి వదిలేశారు

(ఆంధ్రజ్యోతి-నేరేడుచర్ల)

సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో రెండేళ్ల కిందట పార్క్ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.రూ.60 లక్షలతో 14వ వార్డులో చేపట్టిన పార్క్ పనుల్లో కేవలం ప్రహరీ నిర్మించివదిలేశారు. రెండేళ్లుగా పనులు నిలిచాయి. సుమారు 15 వేల జనాభా ఉన్న నేరేడుచర్లలో సేద తీరడానికి ఎక్కడా పార్క్‌లేదు. దీంతో ప్రజలకు వాకింగ్‌కు, సేద తీరడానికి అవకాశం లేకుండాపోతోంది. వెంటనే పార్క్ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీలిస్తాం

నిధులున్నా కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు నిలిచాయి. రెండు రోజుల్లో కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయనున్నాం.

అశోక్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది, వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప



నకిరేకల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని వీటీ కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పజ్జూరు కృష్ణకు చెందిన ఇళ్లు మంగళవారం దగ్ధమైంది. కళ్ల సుదర్శన్ రెడ్డి ఇంట్లో కృష్ణ కొంతకాలంగా అద్దెకు ఉంటూ స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం భార్య, ఇద్దరు కుమార్తెలు దర్వేశిపురం దేవాలయానికి వెళ్లారు. కృష్ణ స్కూల్‌లో విధులు నిర్వహించేందుకు వెళ్లగా ఆయన తల్లి సైదమ్మ ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సైదమ్మ ఇంట్లో నుంచి బయటకువెళ్లింది. ఇంట్లో మూడు రూముల్లోని నిత్యావసరాలు, సామగ్రి మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే సామగ్రి పూర్తిగా మంటల్లో కాలిపోయి సుమారు రూ.5లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. తహసీల్దార్ జమీరొద్దిన్, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్, ఎమ్మెల్యే వీరేశం సతీమణి పుష్ప, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్, పలువురు కౌన్సిలర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజా గాయకురాలు పుష్ప, దైద రవీందర్ బాధితుడికి నిత్యావసరాలు కోసం ఆర్థికసాయం అందజేశారు.

శ్మశానవాటికలో విద్యుత్ మోటార్ చోరీ

కేతేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం చీకటిగూడెం గ్రామంలోని శ్మశానవాటిలో విద్యుత్ పంపుసెట్టు అపహరణకు గురయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలకు హాజరైన వారు స్నానాధికారులు చేయడానికి వీలుగా నీటివసతి కోసం విద్యుత్ పంపుసెట్టును ఏర్పాటుచేశారు. స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీకి కూడా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి శ్మశానవాటికలోని సంపుకు ఏర్పాటుచేసిన ఒక హెచ్‌పీ విద్యుత్ పంపుసెట్టు అపహరణకు గురైంది. దీంతో నర్సరీకి నీటి సరఫరా నిలిచింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని స్థానిక పంచాయతీ కార్యదర్శి స్వాతి కుమారి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిలో ఒకరికి జైలు శిక్ష, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు. ఈ నెల 14న పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆరుగురు మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. వారిని మంగళవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రమణ ఒకరికి రెండురోజుల జైలుతో పాటు రూ.1500 జరిమానా, మిగిలిన ఐదుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నెల వ్యవధిలో డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి జైలు, 62మందికి జరిమానాలు విధించబడ్డాయన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



వెంకటేష్(ఫైల్‌ఫొటో)

నాంపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం చిట్టెంపహాడ్ గ్రామచివరన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన యాచారం వెంకటేష్(30) నాంపల్లి మండల కేంద్రంలోని వైన్స్‌లో కొద్దిరోజులుగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి 10గంటలకు దుకాణంలో పని ముగించుకొని బైక్‌పై మర్రిగూడకు వెళ్తున్నాడు. చిట్టెంపహాడ్ గ్రామచివరలో మూలమలుపు వద్ద తన బైక్ అదుపుతూ తప్పి కిందపడి మృతి చెందాడు. నాంపల్లిలో పనికోసం వెళ్లిన వెంకటేష్ ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు వెతుకుకుంటూ వెళ్లగా కిందపడి ఉండగా గమనించిన వారు నాంపల్లిలోని ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకెళ్లగా అక్కడ ఉన్న వైద్యసిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వెంకటేష్ తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మర్రిగూడ విషాదఛాయలు

మర్రిగూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నాంపల్లి మండలంలో రోడ్డు ప్రమాదంలో యాచారం వెంకటేష్(30) మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం వెంకటేష్ నాంపల్లి మండలంలో ఓ వైన్స్‌షాపులో సిట్టింగ్ నిర్వహిస్తున్నారు. స్థానికులతో కలివిడిగా ఉండే వెంకటేష్ మృతితో విషాదం నెలకొంది. వెంకటేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేష్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

నిచ్చెన పైనుంచి పడి వ్యక్తి మృతి



పాండరి(ఫైల్‌ఫొటో)

రాజాపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భవనం పైనున్న ఇనుప సామగ్రిని తీసేందుకు నిచ్చెన పైకి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చెన్నూరి పాండారి(60) మంగళవారం భవనం పైనున్న పాత సామాను తీసేందుకు కట్ట నిచ్చెన వేసుకొని ఎక్కుతున్న క్రమంలో జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం ఆయనను గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. పాండారికి ముగ్గురు కుమార్తెలు, భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

మిర్యాలగూడలో క్షుద్రపూజల కలకలం

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డులో క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. షాబూనగర్ కాలనీలోని ఏఆర్సీ ఫంక్షన్‌హాన్ సమీపంలో నాలుగు రహదారుల కూడలిలో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి క్షుద్రపూజలు జరిపారు. కూడలి వద్ద పసుపుతో ముగ్గువేసి కుంకుమజల్లి నిమ్మకాయలు, కొబ్బరికాయ పగులకొట్టారు. మంగళవారం ఉదయం స్థానికులు పసుపు, కుంకుమతో వేసిన బొమ్మలను చూసి భయాందోళనకు లోనయ్యారు. తరుచూ ఇలా ఎవరో కూడలిలో ఇలాంటి చర్యలకు పాల్పడుతుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన కూడలి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. ప్రజల్లో నెలకొంటున్న మూఢవిశ్వాసాన్ని తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

పెరటితోటల పెంపకంలో దిట్ట

» అవార్డుల పంట పండిస్తున్న అభిరుచి » గార్డెన్‌ఫెస్ట్‌లో వరుసగా ప్రొఫెసర్ జయశంకర్ ట్రోఫీ, సిల్వర్ గార్డెన్ అవార్డు

పట్టుదలతో పనిచేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని రుజువు చేస్తున్నారు కందాడి బాల్‌రెడ్డి. హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌లో ఉద్యోగం చేసి పదవి విరమణ తర్వాత మూడేళ్లుగా సేంద్రియ ఎరువులతో పెరటి తోటలో కూరగాయలు, పండ్ల సాగు చేపట్టి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు భువనగిరి పట్టణానికి బాల్‌రెడ్డి.

- (ఆంధ్రజ్యోతి భువనగిరి టౌన్)



పెరటితోట పనుల్లో బాల్‌రెడ్డి

భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని బొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కందాడి బాల్‌రెడ్డి. హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌లో ఉద్యోగి. ఉద్యోగ విరమణ తర్వాత మకాం బొమ్మాయిపల్లి గ్రామానికి మార్చాడు. సాగుపై ఉన్న ఆసక్తితో గ్రామంలో ఉన్న 300 గజాల ఇంటి స్థలం ఉంది. అది సున్నం నేల కావడంతో మొక్క బతికేది కాదు. రెండేళ్లలో సారవంతమైంది. ఇప్పుడు పంట్లతోటల అటవీగా మారింది. అలాగే గ్రామంలో ఇంటి పక్కనే ఉన్న మరో రెండు 250 గజాల ఇళ్ల స్థలాలను తీసుకొని కూరగాయలు, పండ్ల తోటల సాగు చేపట్టాడు. ఈ అలవాటే అతడికి రాష్ట్ర స్థాయి అవార్డులను తెచ్చి పెట్టింది. కూరగాయలు, పండ్ల మొక్కల సేద్యమంటేనే ఎకరాల విస్తీర్ణం, రసాయన ఎరువులు, భారీ పెట్టుబడి, అధికమంది కూలీలను ఊహించుకుంటూ చాలా మంది వెనుకంజ వేస్తుంటారు. కానీ బాల్‌రెడ్డి భార్య శోభారాణితో కలిసి ఇంటిని, ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు పండిస్తూ అవార్డులను, గుర్తింపును సొంతం చేసుకుంటూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నాడు. అలాగే సాహిత్యంపై ఉన్న మక్కువతో ప్రజలకు అందించాలని మలుప్రచురణలు ప్రారంభించి ప్రజలకు అందించే పుస్తక ప్రచురణ రంగంలోనూ విజయం సాధించారు. ఉద్యోగ విరమణ తరువాత మకాం బొమ్మాయిపల్లిలోకి మార్చాడు.

అవార్డుల పంట...

అతడి పట్టుదలకు ఒకవైపు పెరటితోటలో పండ్లు, కూరగాయలు పండుతుండగా మరోవైపు అవార్డుల పంట కూడా పడుతున్నది. రాష్ట్ర ఉద్యానవన శాఖ ప్రతి సంవత్సరం గార్డెన్ ఫెస్ట్ నిర్వహిస్తూ తోటల పెంపకంలో పలు కేటగిరీల్లో అవార్డులను అందజేస్తుంది. ఈ మేరకు బాల్‌రెడ్డికి వరుసగా రెండేళ్లపాటు ఉత్తమ అవార్డులు పొందారు. గార్డెన్ ఫెస్ట్-2023, 2024 సంవత్సరాల్లో పెరటితోట విభాగంలో ప్రొఫెసర్ జయశంకర్ ట్రోఫీ సిల్వర్‌గార్డెన్లను అవార్డు సాధించారు. దీంతో ఆ రంగంలో అతడితో పాటు భువనగిరికి కూడా ప్రత్యేక గుర్తింపు లభించింది.

సాగు ఇలా..

పెరటి తోటలలోనే బాల్‌రెడ్డి వైవిధ్యంతో కూడిన సాగు చేస్తున్నాడు. కేవలం ఉత్తర భారత పండ్ల సాగుగా ప్రసిద్ధి చెందిన ఆపిల్ పండ్ల చెట్లు అతడి పెరటి తోటలో ఉంటాయి. పలు రకాల రకాల జామ చెట్లు, పింక్ కలర్‌లో ఉండే థాయ్ జామ, డ్రాగన్ ఫ్రూట్, వంటల్లో వినియోగించే బొంత అరటితో పాటు మూడు రకాల అరటి పండ్ల చెట్లు, పనస, ఖర్జూరా, సపోట, సీతాఫల్, సపోట, ఉసిరితో పాటు పలు ఔషధ చెట్లు ఉన్నాయి. సీజన్‌కు అనుగుణంగా కూర, ఆకుకూరలు ఉంటాయి.

ఎకరాల భూమి లేదని దిగులు పడొద్దు



సాగుకు ఎకరాల భూమిలేదని ఎవరూ దిగులు పడొద్దు. చిన్న ఇంటిలోపల, బంగ్లాపైన తొట్లలో ఆకు, కూరగాయలను, పూల మొక్కలను పెంచవచ్చును. మరి కాస్త ఖాళీ స్థలం ఉంటే పండ్ల మొక్కలను సాగు చేయ వచ్చును. ఇందుకు కావాల్సిందల్లా ఆసక్తి మాత్రమే. ప్రతి చదరపు గజం స్థలాన్ని సద్వినియోగం చేస్తూ పెరటి తోటలను సాగుచేస్తే ఇల్లు నందన వనంగా ఉంటుంది. ప్రశాంతత, నాణ్యమైన కూరగాయలు లభిస్తాయి. సొంతంగా ఖాళీ స్థలాలు లేనివారు సమీపంలోని ఖాళీ పాట్లను లీజుకు తీసుకుని మొక్కలను పెంచితే కుటుంబ కూరగాయల, పండ్ల అవసరాలు తీరి మిగులు వాటిని విక్రయిస్తే ఆదాయ వనరుగా ఉంటుంది. అలాగే పరి సరాలు పరిశుభ్రంగా ఉంటాయి.

- కందాడి బాల్ రెడ్డి, బొమ్మాయిపల్లి.

సేంద్రియ సాగు...

దంపతులిద్దరూ ఆ కాస్త సమయాన్నంతా పెరటి తోటల పెంపకానికే వెచ్చిస్తారు. సాగుకు పేడ, బెల్లం, గోమూత్రం, పిండి, మజ్జిగతో సొంతంగా తయారు చేసుకున్న జీవామృతం, సేంద్రియ ఎరువులను, చీడ నివారణకు హోమియో మందులను వినియోగిస్తాడు. అలాగే వీరి సాగులో ఔషధ మొక లు, నాటు కోళ్లను, గొర్రెలను కూడ పెంచుతుండటం విశేషం.



సాగర్ సమాచారం




పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	515.20
టీఎంసీలు	140.6.684
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	0
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1,890 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు



పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.32 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	626.90 అడుగులు
టీఎంసీలు	1.02
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	150.23 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	32.63 క్యూసెక్కులు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమల పాకులు, సిందూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటిక మూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ 20,61,795 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని సినీ సంగీత దర్శకుడు కోటీ (సాలూరి కోటేశ్వరరావు) దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదం అందజేశారు. క్షేత్ర మహత్యం సంబంధించి తాను అల్బమ్ చేయడానికి సంకల్పించినట్లు కోటి తెలిపారు.

మట్టపల్లి క్షేత్రంలో..

మఠంపల్లి (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి క్షేత్రంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్య కల్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరివిజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సాధికారత సాధించాలి

● పద్మశ్రీ డాక్టర్ ఏ ఎస్ నారాయణ



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఏఎస్ నారాయణ, కిషోర్‌రెడ్డి,రవి

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి, సాధికారత సాధించాలని పద్మశ్రీ డాక్టర్ ఏఎస్ నారాయణ సూచించారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణ కేంద్రంలో సర్టిఫికెట్లు పొందిన 45 మంది మహిళలకు రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి రూ.3 లక్షల విలువైన కుట్టు మిషన్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఏఎస్ నారాయణ మాట్లాడుతూ సాయిబాబా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి మాట్లాడుతూ మహిళలు తాము నేర్చుకున్న కుట్లు అల్లికలతో స్వయంగా ఉపాధి పొందుతూ మరి ఎంతో మందికి మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ డాక్టర్ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ వృత్తులను మరింత నవీకరించుకునేందుకు తమ సంస్థ ద్వారా రాష్ట్రంలో 50 విస్తరణ కేంద్రాల నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సాహితీవేత్త బడుగు శ్రీరాములు, ఫ్యాషన్ డిజైనర్ కృష్ణమూర్తి, ఎస్‌ఐ జగన్, సెర్ప్ ఏపీఎం యాదయ్య, సామాజిక కార్యకర్తలు పర్ని శివారెడ్డి, సుక్క సుద ర్శన్, సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధి చిలువేరు హరిప్రసాద్, ప్రవాస భారతీయ విద్యార్థులు తేజ, త్రిష, శ్రీరామలక్ష్మి పాల్గొన్నారు. అలాగే సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురంలోని శిక్షణ కేంద్రంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 75 మంది మహిళలకు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్ కిషోర్ రెడ్డి, పద్మశ్రీ డాక్టర్ నారాయణ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా..

(5వ పేజీ తరువాయి)

ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 42వేల ఇందిరమ్మ ఇళ్లు మొదటి దశలో రానున్నాయి. అందుకోసం లబ్ధిదారులు ఇప్పటికే భారీగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు, ఎమ్మెల్యేల ద్వారా ఇళ్లు మంజూరు చేయించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అధికారులు జాప్యం చేయకుండా ప్రభుత్వం ఆదేశించిన షెడ్యూల్ మేరకు కార్యాచరణ అమలు చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకూ మౌలిక వసతులు

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో ఇళ్లను పంపిణీ చేసినప్పటికీ మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు నివాసం ఉండే పరిస్థితి లేదు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులైన మరుగుదొడ్ల సెప్టిక్‌ట్యాంక్, సీవరేజ్, వాటర్ ట్యాంక్, విద్యుత్, పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన 444 ఇళ్ల సముదాయానికి సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు రూ.2.55 కోట్లు మంజూరు చేసింది. అదేవిధంగా భూదాన్‌పోచంపల్లిలో 120, కొండమడుగులోని 30, జబ్లిక్‌పల్లిలోని 36, బీబీనగర్‌లోని 11 ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించిన సర్కారు నిధులు మంజూరుపై స్పందించింది. త్వరలో ఈ సముదాయాల వద్ద మౌలిక వసతులు కల్పించి, లబ్ధిదారులను నివాసం ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఇక అసంపూర్తిగా నిలిచిన ఇళ్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

పకడ్బందీగా లబ్ధిదారుల ఎంపిక

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాం. అర్హులకే ఇళ్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామసభలో ఎంపికైన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించిన తరువాతే మంజూరు పత్రాలు అందజేస్తాం. జిల్లా, మండల స్థాయిలో అధికారులు పథకం అమలును పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపికను స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ పూర్తిచేస్తాం. మే నెలలో లబ్ధిదారుల ఎంపిక, మంజూరు పత్రాలు పంపిణీ చేస్తాం. అనంతరం ఇళ్ల నిర్మాణాల స్థాయిని బట్టి లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తాం. మూడు నెలల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు సన్నద్ధమవుతున్నాం.

●ఎం.హనుమంతరావు, కలెక్టర్

మానవ సేవే మాధవ సేవ

» ప్రముఖ నటుడు బాబు మోహన్ » చౌటుప్పల్ పట్టణంలోని అమ్మా నాన్న అనాథాశ్రమం సందర్శన

చౌటుప్పల్ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అనాథలు దేవుడి ప్రతిరూపాలని నటుడు, మాజీ మంత్రి, పవన్ బాబుమోహన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాబుమోహన్ అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని అమ్మానాన్న అనాథాశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమం ఏర్పాటు, నిర్వహణ, దాతల సహకారం తదితర విషయాలను ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. శివలింగానికి పూజలు చేసి, రూ.14 కోట్లతో నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ నిర్మాణంలో తన పేరుతో ఏర్పాటు చేసిన ఒక ఇటుకను పేర్చారు. ఆశ్రమానికి భగవంతుడి కృపను అందించాలని ప్రార్థిస్తూ హోమం నిర్వహించారు. పవన్ బాబుమోహన్ చారిటబుల్ ట్రస్ట్ తరపున 610మంది అనాథలకు అన్నదానం చేశారు. అనాథ ఆశ్రమంలోని ఓ మానసిక దివ్యాంగుడు మాములు వ్యక్తిగా మారడంతో పునర్జన్మ కార్యక్రమం కింద అతడికి జుత్తు కత్తిరించి స్వస్థలానికి పంపించారు. అనంతరం బాబుమోహన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శివయ్య రూపాలతో వచ్చిన అనాథలు, మానసిక దివ్యాంగులకు అన్ని తెలుసు కానీ ఏమీ చెప్పరని, కష్టాల్లో ఉన్న వారికే దేవుడు కనిపిస్తాడన్నారు.



అన్నదానం చేస్తున్న బాబు మోహన్

యువత తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు

యువత తప్పిదాలతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలను నడిపే సమయంలో చేసే సమయంలో తనపై ఆధారపడిన తల్లిదండ్రులు, భార్య బిడ్డలను గుర్తు చేసుకోవాలని బాబుమోహన్ సూచించారు. తన కుమారుడు పవన్ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ఒక పాపను తప్పించే క్రమంలో అకస్మాత్తుగా బ్రేక్ వేయటంతో ప్రమాదం జరిగి మృతి చెందారని భావో ద్వేగానికి గురయ్యారు. పవన్ పేరుతో ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామని, ఈ ట్రస్ట్ ద్వారా పేదలకు విద్య, వైద్యం, పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. జూనియర్ ఆర్టిస్టులకు భోజన సదుపాయాన్ని కల్పిస్తుంటానని, పేదవాడికి పట్టెడన్నం పెడితే తృప్తినిస్తుందన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్, రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూని యన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, శ్రావణి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి



ప్రదర్శనను సందర్శించిన ప్రొఫెసర్ సుధాకర్, శాస్త్రవేత్తలు, విద్యార్థినులు, రైతులు

మోటకొండూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అధిక దిగుబడులు పొందాలని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధాకర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో రైతుసదస్సు, వ్యవసాయ ప్రదర్శనను ఏరువాక కేంద్రం భువనగిరి వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదం ాబాద్ విద్యార్థినులు సంయుక్తంగా మంగళవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట విత్తే సమయం నుంచి కోత వరకు యంత్ర పరికరాలను ఉపయోగించి కూలీల కొరతను ఎదుర్కోవడమే కాకుండా పెట్టుబడులను తగ్గించుకోవాలన్నారు. పంట మార్పిడి, అంతర పంటల, మిశ్రమ పంటల సాగును కొనసాగిం చాలన్నారు.

డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ. పంటలను కోతులు, అడవి పందులు, నెమళ్ల పక్షుల నుండి రక్షించడానికి ఉపయోగించే సోలర్ కంచె, మంకీగన్, జీవ అర్థన యంత్రం గురించి వివరించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మోడల్స్ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు బి.అనిల్ కుమార్, మధు శేఖర్, ఏట రమాదేవి, ఉద్యానవన అధికారి స్రవంతి, ప్రొఫెసర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

రాయితీ గ్యాస్ పక్కదారి

● వ్యాపార అవసరాలకు వినియోగం ● ప్రభుత్వ ధనం వృథా

(ఆంధ్రజ్యోతి, సూర్యాపేట)

రాయితీ గ్యాస్ పక్కదారి పడుతోంది. జిల్లాలో పలు హోటళ్లలో డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారు. అనేక మంది హోటళ్ల యజమానులు గుట్టుచప్పుడు కాకుండా రాయితీ సిలిండర్లను వంటల కోసం వినియోగిస్తున్నారు. వ్యాపార అవసరాలకు వినియోగించే 19కేజీల సిలిండర్ రూ.1690లు కాగా, గృహావసరాలకు వినియోగించే సిలిండర్ రూ.14.2కిలోలు ఉంటుంది. దీని ధర రూ.975లు. దీనికి తోడు ప్రభుత్వం రాయితీ రూ.500ఇస్తుంది. వినియోగదారుడి వ్యక్తిగత ఖాతాలో ఈ రాయితీని జమ చేస్తారు. దీంతో సగం కంటే తక్కువ ధరలో వస్తుండడంతో దళారులు రంగ ప్రవేశం చేసి రాయితీ సిలిండర్లను పక్కదారి పట్టిస్తున్నారు. గృహావసరాలకు రాయితీపై ప్రభుత్వం తొమ్మిది సిలిండర్లు ఇస్తోంది. పలు కుటుంబాలకు ఒక సిలిండర్ రెండు నుంచి మూడు నెలల వరకు సరిపోతుంది. తమకు అవసరం లేకున్నా కేవలం ప్రభుత్వం ఇచ్చే రాయితీ కోసం కొందరు వినియోగదారులు ప్రతి నెలా గ్యాస్ బుక్ చేసి సిలిండర్లు ఇతరులకు అప్పగిస్తున్నారు. ఎక్కువగా ఉజ్వల దీపం పథకం లబ్ధిదారులకు డబ్బు ఆశ చూపి దళారులు ప్రభుత్వ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారు.



గ్యాస్ సిలిండర్లు

అడపాదడపా దాడులు

పెద్ద హోటళ్లలో సైతం డొమెస్టిక్ సిలిండర్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. డొమెస్టిక్ పక్కనే కమర్షియల్ సిలిండర్లను అంటిపెట్టుకొని ఎవరైనా దాడులు చేసినప్పుడు డొమెస్టిక్ సిలిండర్‌ను పక్కన పెట్టి కమర్షియల్ సిలిండర్‌ను చూపుతున్నారు. జిల్లాలో దాదాపు 1360కి పైగా హోటళ్లు ఉన్నాయి. ఇవేకాకుండా కొంతమంది కారులకు గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నారు. ఇది ఒక వ్యాపారంగా కూడా మారింది. పట్టణ ప్రాంతాలల్లో నివసించే చాలా కుటుంబాలకు ఒక సిలిండర్ 40 రోజుల నుంచి 60 రోజుల వరకు వస్తుంది. చిన్న కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాలల్లో కట్టెల పొయ్యిపై వండే వారు మూడు నుంచి నాలుగు నెలల వరకు ఒక సిలిండర్ సరిపోతుంది. ఇలాంటి అవకాశమే కొంత మంది దళారులకు వరంగా మారింది. సిలిండర్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా వారి గ్యాస్ బుక్‌ను వినియోగిస్తున్నారు. సిలిండర్‌ను రాయితీ తీసుకుని వాటిని వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు.

జిల్లాలో నెలలో లక్షకు పైగా సిలిండర్ల వినియోగం

సూర్యాపేట జిల్లా పరిధిలో భారత్, హెచ్‌పీ, ఇండియన్ గ్యాస్ కంపెనీలకు సంబంధించిన ఏజెన్సీలు 25 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,44,034 కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ఉజ్వల 44,322, దీపం పథకం కింద 55,537, సాధారణం 1,44,175 కనెక్షన్లు ఉన్నాయి. అయితే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల ద్వారా జిల్లాలో నెలలో లక్షకు పైగా సిలిండర్ల వినియోగమవుతోంది. . డబుల్ సిలిండర్ కనెక్షన్ ఉన్న వారి నుంచి ఎక్కువగా సిలిండర్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు డొమెస్టిక్ సిలిండర్ నుంచి గ్యాస్ తీసి రెండు కిలోలు, ఐదు కిలోల సిలిండర్లను విక్రయిస్తున్నారు. గతంలో విజిలెన్స్ శాఖ దాడులు చేసి పలు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం మళ్లీ ప్రభుత్వం ఇచ్చే గ్యాస్ సబ్సిడీ పక్కదారి పడుతోంది.

పక్కదారి పట్టిస్తే చర్యలు

సబ్సిడీ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. కేవలం గృహాలకు సంబంధించి మాత్రమే ఈ గ్యాస్‌ను వినియోగించుకోవాలి. వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

●రాజేశ్వర్, డీఎస్‌వో, సూర్యాపేట

స్లాట్ బుకింగ్‌తో వినియోగదారులకు ఇబ్బంది



గుట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 15. (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రవేశపెడుతున్న స్లాట్ బుకింగ్ విధానంతో వినియోగదారులు ఇబ్బంది కలుగుతోందని స్థానిక డాక్యుమెంట్ రైటర్లు ఆరోపించారు. తెలంగాణ డాక్యుమెంట్ రైటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జన్నాల్, రామకృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్ పిలుపు మేరకు గుట్టలో మంగళవారం స్థానిక డాక్యుమెంట్ రైటర్ల ఆధ్వర్యంలో స్లాట్ బుకింగ్ వద్దు, పాత పద్ధతే ముద్దు అంటూ ప్లకార్డులతో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైటర్లు మాట్లాడుతూ స్లాబ్ పద్ధతులు అవలంబిస్తే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతారని, దీంతో పాటు ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగులు దాస్తవేజు లేఖరులుగా ఉపాధి పొందుతున్న వారి బతుకులు రోడ్డున పడుతాయని అన్నారు.ప్రభుత్వం పునరాలోచించి స్లాట్ పద్ధతిని వెంటనే ఉపసంహరించుకోవాలని, పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్ వెంకట్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు ఎంఏ ఖాదర్‌షరీఫ్, పోశెట్టి, శ్రీధర్, ప్రవీణ్, జంగయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, శ్రీరామోజు శ్రీనివాస్, రాజు, వసీం, గణేష్, కుమార్, వీరస్వామి అంజిరెడ్డి పాల్గొన్నారు.

వడగండ్ల బాధితులను ఆదుకోవాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉట్కూర్ గ్రామంలో వడగండ్లతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ కోరారు. మండలంలోని ఉట్కూరు గ్రామ శివారులో వడగండ్లకు దెబ్బతిన్న పొలాలను మంగళవారం పరిశీలించారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

నల్లగొండ, ఏప్రిల్ 15: (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పీఆర్‌టీయూటీఎస్ ఉపాధ్యాయ మాస పత్రిక సబ్‌ఎడిటర్, గుర్రంపోడు మండలం నడిగూడ ఎంపీపీఎస్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం కాలం నారాయణరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ మాసపత్రిక సబ్ ఎడిటర్‌గా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పల్గం దామోదర్‌రెడ్డి, గుండు లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియమానికి సహకరించిన సంఘం నాయకులకు నారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాతకు అపార నష్టం

నకిరేకల్, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో పంటలు నష్టపోయి రైతులు ఆగమవుతున్నారు. ఈ నెల 13వ తేదీ కురిసిన అకాల వర్షం, వడగాలులతో పంటలు దెబ్బతిన్నాయి. నకిరేకల్ మండలంలోని ఓగోడు నడిగూడెం, పాలెం, వల్లభాపురం, టేకులగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన సుమారు 15వేల బస్తాల ధాన్యం తడిసింది. ఆ గ్రామాల్లో నిమ్మ చెట్లు నేలకొరిగి కాయలు రాలిపోయాయి. ఆరుగాలం కష్టాన్ని వర్షం నిండా ముంచిందని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. నకిరేకల్, శాలిగౌరారం మండలాల్లో 800 ఎకరాల్లో నిమ్మ చెట్లు దెబ్బతిన్నట్లు గుర్తించామని నకిరేకల్ ఉద్యానవన శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మూడు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

అకాలవర్షంతో మండలంలోని ఓగోడు, పాలెం, నడిగూడెం, వల్లభాపురం, టేకులగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడు రోజుల నుంచి బోరుబావులకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మూగజీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడం, బోరుబావులకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు మూగజీవాలను తాగునీటి కోసం మూసీ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయి తీగలు తెగిపోవడంతోనే విద్యుత్



టేకులగూడెంలో నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

సరఫరాలు జాప్యం జరుగుతుందని విద్యుత్ ఏఈ సాయిగణేష్ తెలిపారు.

అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పాలెం, టేకులగూడెం గ్రామాల్లో పంటలు నష్టపోయన పొలాలను పరిశీలించారు. ఆయన వెంట పీఏసీఎల్ ఛైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్ రావు, తహసీల్దార్ జమీరొద్దిన్, ఏవో జానిమియా, ప్రవీణ్‌కుమార్, నాయకులు గాదగోని కొండయ్య, యాస కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చండూరులో అకాల వర్షం

చండూరు, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): చండూరులో మంగళవారం కురిసిన ఈదురు గాలులు, కొన్ని నిమిషాల పాటు వడగండ్లు కురవడంతో పట్టణమంతా జలమయమైంది. పట్టణంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహమూద్ తన ఇంటి వద్ద ఉన్న కారుపై చెట్టు విరిగిపడడంతో దెబ్బతిన్నది. పట్టణ శివారులో ఉన్న లకినేనిగూడెం వద్ద చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో, రాకపోకలకు అంతరాయం కలగడంతో మాజీ కౌన్సిలర్ మంచుకొండ కీర్తి సంజయ్ యువకులతో కలిసి తొలగించారు. పట్టణంలోని అంగడిపేటలో చండూరు- హైదరా బాద్ ప్రధాన రహదారిపై కూడా అడ్డంగా భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అక్కడక్కడ చెట్లు కొమ్మలు, పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

తడిసిన ధాన్యం

అకాల వర్షాలు రైతులకు వణుకు పుట్టిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి తీసుకొచ్చిన రైతులకు అరిగోస తప్పడం లేదు. ఆరుకాలాలు కష్టించి



జలమయమైన చండూరు పట్టణం



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ దశరథ

పండించిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. మంగళవారం సాయంత్రం చండూరులో కురిసిన అకాల వర్షంతో ఐకేసీ కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం నేలపాలవ్వడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. అధికారులు సకాలంలో కాంటా వేయకపోవడం తోనే తమ పంట వర్షానికి తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. తహసీల్దార్ దశరథ ఐకేపీ కేంద్రానికి చేరుకుని తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవసభను విజయవంతం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. కట్టంగూరులో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. గులాబీ జెండా ప్రజలకు అండా అని, అన్ని వర్గాల ప్రజలు సభకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాం, మాజీ వైస్ ఎంపీపీ కోటిరెడ్డి, మాజీ మార్కెట్ వైస్‌ఛైర్మన్ నర్సింహ, మాజీ సర్పంచులు సైదులు, సైదిరెడ్డి, నాయకులు బాల నర్సింహ, చెవుగోని జనార్దన్, అంతటి శ్రీను, వెంకటేశ్వర్లు, యాదయ్య, ఉత్తరయ్య, ఉపేందర్ రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి'

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని అసైన్డ్ భూమిని పేదలకు పంచాలని మాల మహనాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేశ్ కోరారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే 550లోని సుమారు 100 ఎకరాల్లో గల అసైన్డ్ భూమిని గతంలో అసైన్డ్ కమిటీ ఆమోదంతో పేదలకు అందజేశారని, ఇంకా మిగిలిన కొంత భూమిలో సుమారు 3 ఎకరాలను ఓ ప్రైవేట్ కంపెనీ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిందని పేర్కొన్నారు. విచారణ చేసి ఆ భూమిని స్వాధీన పర్చుకుని ప్రభుత్వ అవసరాలకు వాడాలన్నారు.

నల్లచెర్వు నుంచి అక్రమంగా మట్టి తరలింపు



చెర్వుగట్టు నల్లచెర్వు నుంచి మట్టి తవ్వేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్ (ఫైల్)

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో చెర్వుల స్థలాలే మట్టి కూడా అక్రమ రవాణా పాలవుతోంది. మట్టి తరలింపు కోసం చెర్వును అడ్డగోలుగా తవ్వుతూ ధ్వంసం చేస్తున్నా పట్టించుకునే వారులేరు. నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు నల్లచెర్వు నుంచి కొన్ని రోజులుగా మట్టి అక్రమంగా రవాణా కొనసాగుతోంది. అధికారుల సెలవు దినాలను చూసుకుని మట్టి తవ్వుతున్నట్లు తెలుస్తోంది. ఉపాధిహామీ పనుల్లో గతంలో రైతుల పొలాలకు మట్టిని తరలించగా ఇప్పుడు అదే నెపంతో చెర్వుమట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్స్‌కవేటర్లు ఉపయోగించి చెర్వులోని మట్టిని ఓ వెంచర్‌లోకి చేరవేశారన్న పిర్యాదులు అధికారులకు చేరాయి.

మల్లేశ్వరీ మృతికి కారణమైన జానిరెడ్డిని శిక్షించాలి

నల్లగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కులవివక్షకు బలైన మల్లేశ్వరీ మృతికి కారణమైన జానిరెడ్డిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేటి శ్రీను, పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మల్లీశ్వరీ హైదరాబాద్‌లో నర్సుగా పనిచేస్తుందన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి జానిరెడ్డి మోసం చేశాడన్నారు. అతను వేరే అమ్మాయితో ఇటీవల పెళ్లి చేసుకోవడంతో మనస్తాపం చెందిన మల్లేశ్వరి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. జానిరెడ్డితో పాటు అతని కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని కోరారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, రామగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. చలో బస్తీ అభియాన్‌లో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం 19వ వార్డులోని శ్రీనగర్‌కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీలో గల భక్తాంజనేయ స్వామి దేవాలయం, ముత్యాలమ్మ గుడి దేవాలయాల్లో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. జాతీయ ఆహార పంపిణీ పథకంలో రేషన్ దుకాణానికి వెళ్లి లబ్ధిదారులకు అందజేస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీపంగి జగ్జీవన్, మిర్యాల వెంకటేశం, పగిడి మహేష్, కంచనపల్లి రవికుమార్, నారగోని వెంకన్న, బీపంగి చంటి, వివేక్, పాలకూర రమాదేవి, మూడో సైదులు పాల్గొన్నారు.

ఎండలు మండెన్





కూలర్ తీసుకెళ్తున్న వినియోగదారులు



రోజు రోజుకు ఎండలు పెరుగుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడి పోతున్నారు. వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలు వేడి నుంచి ఉపశమనానికి శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్



నిమ్మకాయ సోడా తాగుతున్న ప్రజలు





గొడుగు నీడన ..

సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కనగల్, ఏప్రిల్ 15:(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుమర్లపల్లి గ్రామంలోని శ్రీసీతారామచంద్ర లక్ష్మణ భక్తాంజనేయ భవాని శంకరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యహావాచనం, దీక్షా ధారణ పూజలు, ముత్యాలమ్మ, అమ్మవారికి, గ్రామ బొడ్రాయికి అభిషేకాలు, బలిహరణ, యాగశాల ప్రవేశం, మూలమంత్ర హోమాలను నిర్వహించారు. కాగా



పూజల్లో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

గురువారం సీతారామచంద్రస్వామి వారి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

కట్టంగూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు మోడల్ మండలంగా గుర్తించి అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. కట్టంగూరు మండలంలో నెలకొన్న స్థానిక సమస్యలపై కట్టంగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15వరకు చేపట్టిన పల్లె పల్లె ప్రగతి పోరుబాట మంగళవారం ముగిసింది. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయన్నారు. మండలానికి తాగునీటి వనరైన ఆసిఫ్‌నహర్ కాల్వ పూడిక పెరిగి పోవడంతో నీరు లేక మండంలోని అనేక చెరువులు ఎండిపోయాయన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతిని అధ్వానంగా మారాయన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కట్టంగూరు నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంజర్ల సైదులు, రామస్వామి, మురారి మోహన్, జాల రమేష్, గడగోజు రవీంద్ర చారి, కట్ట బక్కయ్య, చెరుకు లక్ష్మయ్య, ముసుగు రవీందర్, ఇటుకల సురేందర్, రామకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు సలీంను సన్మానిస్తున్న ఎస్పీ

నల్లగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ మంగళవారం సన్మానించారు. ఫింగర్ ప్రింట్స్ విభాగంలో హోంగార్డుగా పనిచేసిన ఎండీ సలీం ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ పొందిన వారు సామాజిక కార్య క్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, హోంగార్డు ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపైకి చేరడానికి మెట్లు ఏర్పాటు

కేతేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపహాడ్ బస్‌స్టేజీ వద్ద హైవే మీదకు ప్రయాణికులు వెళ్లడానికి వీలుగా రూ.30వేలు ఖర్చు చేసి దాతలు మెట్ల మార్గం నిర్మించారు. స్థానిక బంగారు మైసమ్మ ఆలయం వద్ద హైవేపై అండర్ పాసింగ్ వంతెన నిర్మించడంతో ఈ స్టేజీ వద్ద బస్ దిగాలన్నా, ఎక్కాలన్నా దాదాపు 20అడుగుల మేర ఎగువకు ఎక్కాల్సి ఉంటుంది. నిత్యం ప్రయాణికులు, వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను గమనించిన స్థానిక



మెట్ల వద్ద దాతలు

బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణదాత, తుంగతుర్తి గ్రామానికి చెందిన ముదిరెడ్డి యాదగిరిరెడ్డి, ఉప్పలపహాడ్ ఆవాస గ్రామమైన భాగ్యనగర్‌కు చెందిన బైరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ. 30వేలు ఖర్చు చేసి మెట్లు నిర్మించారు. రెండు మూడు రోజులుగా ప్రయాణికులు సునాయాసంగా హైవే మీదకు వెళ్లి బస్సులు ఎక్కగలుగుతున్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, ఏప్రిల్ 15:(ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదిక్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలను జరిపించి చీరసారె ఒడిబియ్యం బోనవైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. నల్లగొండ పట్టణం భక్తాంజనేయ స్వామి ఆలయ ఈవో



కలషిక కుషలయ్య అమ్మవారిని దర్శించు కున్నారు. అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

చింతపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంఈవో అంజయ్య తెలిపారు. మంగళవారం చింతపల్లి మండలంలోని 34 పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు విడుదల చేసిన వంట సామగ్రిని వీటీ నగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల సంక్షేమానికి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి బోధించాలన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుటకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీటీనగర్ హెచ్‌ఎం కృష్ణవేణి, టీచర్లు ఎండీ అన్వర్, సుధీర్, పాల్వాయి వాసుదేవ్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

● అధ్వానంగా తుర్కపల్లి- అన్నారం రోడ్డు ● కంకర తేలి అడుగడుగునా గుంత





కంకర తేలి ధ్వంసమైన తుర్కపల్లి- అన్నారం రోడ్డు

కనగల్, ఏప్రిల్ 15: (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కపల్లి- అన్నారం రోడ్డు అధ్వనంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పాడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఉన్నాయి. ఈ రోడ్డు మార్గనా వెళ్లాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. తుర్కపల్లి స్టేజీ నుంచి హాలియా మండలం యాచారం వరకు సుమారు 13 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏళ్ల తరబడి రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో బీటీరోడ్డుపై కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ద్విచక్రవాహన దారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెలిదొండపాడు-తుర్కపల్లి గ్రామాల మధ్య వరద కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. వర్షాకాలంలో కల్వర్టులో వరద ఉధృతికి వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. ఈ కల్వర్టు వద్ద పలు వాహనాలు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో హైదలాపురం, తుర్కపల్లి, అన్నారం, నడికుడ తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు తిమ్మాజిగూడెం, కనగల్ మీదుగా నల్లగొండకు రాకపోకలు సాగిస్తున్నారు.

డబుల్ రోడ్డుగా విస్తరించాలి



తుర్కపల్లి-యాచారం సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించాలి. ఈ మార్గాన నిత్యం ప్రయాణించే వాహనదారులు గంతల రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ధ్వంసమైన కల్వర్టుల స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలి.

● కట్టెబోయిన నాగరాజు, మాజీ ఎంపీటీసీ తుర్కపల్లి.

రోడ్డు మరమ్మతులకు త్వరలో టెండర్

దేవరకొండ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తుర్కపల్లి వయా యాచారం వరకు గల బీటీ రోడ్డు మరమ్మతు పనులకు ప్రభుత్వం త్వరలో టెండర్ పిలిచే అవకాశముంది. టెండర్ అనంతరం రోడ్డు ప్యాచ్ వర్క్ మరమ్మతు పనులు ప్రారంభమవుతాయి.

● అనిత, అర్అండ్‌బీ జేఈఈ కనగల్ మండలం.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
బుధవారం 16 ఏప్రిల్ 2025

చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	225	245
సూర్యాపేట	రూ.150	210	240
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 । కనిష్ఠం 24.0



నాగార్జునసాగర్ పార్క్‌లో ఎండిన గడ్డి

ఆంధ్రజ్యోతి విజిట్

ఆహ్లాదం.. ఆమడ దూరం

- మునిసిపాలిటీల్లో అధ్వానంగా పార్క్‌ల నిర్వహణ
- పచ్చదనం కనుమరుగు
- పలుచోట్ల దెబ్బతిన్న క్రీడాసామగ్రి
- అసౌకర్యాలతో కానరాని సందర్శకులు

నిత్యం ఉరుకులు.. పరుగులతో గడిపే పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, కాస్త ఆహ్లాదం అందించేందుకు పురపాలికలు గతంలో పార్కులను ఏర్పాటుచేశాయి. ఉదయం,సాయంత్రం వాకింగ్‌తోపాటు పిల్లల ఆటలు,సేద తీరుతున్న పెద్దలతో నిత్యం సందడిగా ఉండేవి. ప్రస్తుతం ఈ పార్కుల నిర్వహణను పురపాలికలు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. కొన్ని పార్కుల్లో అసలు పచ్చదనమే కరువై ఆనవాళ్లు కోల్పోతున్నాయి. మరికొన్ని చోట పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటుచేసిన క్రీడాసామగ్రి దెబ్బతిని నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత వేసవిలో ప్రజలు ఉపశమనం పొందేందుకు పచ్చని పార్కులు కరువయ్యాయి. ఇప్పటికైనా మునిసిపాలిటీ అధికారులు పట్టించుకొని పార్కులను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● వివరాలు 6లో..



కనగల్ మండలం తేలకంటిగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన లబ్ధిదారుడు

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా..

- ఇందిరమ్మ ఇంటికి ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి
- నియోజకవర్గానికో స్పెషలాఫీసర్ నియామకం
- 360 డిగ్రీ సర్వే నిలిపివేసి, క్షేత్రస్థాయి పరిశీలన చేయాలనే డిమాండ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల సమావేశంలో సూచించారు. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను జాగ్రత్తగా రూపొందించాలని, అర్హులకే పథకం వర్తించేలా చూడాలని సమావేశంలో సీఎం సూచించారు. జిల్లా స్థాయిల్లో ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొందాకే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేయాలని నిర్ణయించారు.
- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున తొలివిడత ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వనున్నారు. అందుకు ఇప్పటికే ప్రజాపాలనలో, ఇటీవల మీ-సేవా కేంద్రాల ద్వారా అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు మినహా ప్రస్తుతం స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అర్హుల జాబితా రూపకల్పనలో వారి అభిప్రాయాలకు అధికారులు తప్పకుండా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అర్హుల ఎంపికలో ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లకు లోనుకావద్దని, పూర్తి పారదర్శకంగా అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రతీ నియోజకవర్గానికి స్పెషలాఫీసర్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించాలని నిర్ణయించారు. అదేవిధంగా నాలుగైదు గ్రామాలకు కలిపి ఒక క్లస్టర్‌గా రూపొందించి ఒక మండల స్థాయి అధికారిని క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించి అర్హుల జాబితా రూపొందించాలని ప్రభుత్వం సూచించింది. మండల స్థాయి ఇందిరమ్మ కమిటీలు అందించే జాబితాలను క్లస్టర్ కమిటీలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి జాబితా రూపొందిస్తాయి. ఈనెల 17లోగా ప్రజాప్రతినిధులతో చర్చించి, నియోజకవర్గాల్లో ఏ గ్రామానికి ఎన్ని ఇళ్లు కేటాయించాలనే విషయాన్ని కలెక్టర్లు నిర్ధారిస్తారు. ఆ తరువాత 21వ తేదీ వరకు క్లస్టర్ స్థాయిలో ఇన్‌చార్జి అధికారులు అర్హుల జాబితాలు పరిశీలించి నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అందజేస్తారు. 22 నుంచి 30వ తేదీ వరకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను కలెక్టర్‌కు నివేదిస్తారు. మే 1న అన్ని మునిసిపల్ కార్యాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో అర్హుల జాబితాలను ప్రదర్శిస్తారు. మే 2 నుంచి 4వ తేదీ వరకు కలెక్టర్ల ఆధ్వర్యంలో మరోసారి జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్పెషలాఫీసర్లు, జిల్లా స్థాయి స్పెషలాఫీసర్లతో చర్చించి తుది జాబితాను ఖరారు చేస్తారు. చివరగా ఇన్‌చార్జి మంత్రి పరిశీలించి ఆమోదించిన తర్వాత మే 5 నుంచి 7వ తేదీ లోపు లబ్ధిదారుల జాబితాను కలెక్టర్ ఆమోదించి ఇళ్లను మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సీఎం, మంత్రులు స్పష్టంగా ఆదేశించడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరగకుండా అప్రమత్తమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు

మిగతా 7వ పేజీలో...

360 డిగ్రీల సర్వే పేరుతో అనర్హులకు జాబితాలో చోటు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి తొలగించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ప్రజాపాలన దరఖాస్తులతో పాటు, ఇటీవల ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు తీసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తికాలేదని అధికారు లు చెబుతున్నా, మరోవైపు ఇటీవల ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు జాబితా పంపాలనే ఆదేశాలతో మునిసిపల్ అధికారులు, ఎంపీడీవోలకు వచ్చిన జాబితాల్లో అనర్హుల పేర్లున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. నల్లగొండ, దేవరకొండ, హాలియా, నకిరేకల్ మునిసిపాలిటీతోపాటు పలు గ్రామాల్లో ఈ పరిస్థితి వెలుగులోకి వచ్చింది. 360 డిగ్రీల కోణంలో దరఖాస్తులు పరిశీలించి అర్హుల జాబితా తయారు చేస్తున్నామని చెబుతున్న అధికారులు, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేయకుండానే అర్హుల జాబితా తయారు చేశారని, దీంతో నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. రేషన్‌కార్డు, ఆధార్‌నెంబర్ ఆధారంగా గతంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా హౌసింగ్ పథకాలు పొందకపోతే వారిని అర్హులుగా పేర్కొంటూ జాబితాల్లో చేర్చారని, కానీ వారికి రేషన్‌కార్డులున్నా, వ్యవసాయభూమి లేకపోయినా ప్లాట్లు, సొంత ఇళ్లు ఉన్నాయని, క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే చేస్తే ఈ విషయాలు బయటపడతాయని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు ఈ విషయాలను పట్టించుకోకుండా ఆన్‌లైన్‌లోనే పరిశీలించి అర్హుల జాబితా తయారు చేస్తుండటంతో గ్రామాల్లో, మునిసిపల్ వార్డుల్లో అనర్హులు లబ్ధిపొంది, అర్హులు పథకానికి దూరమవుతారని కాంగ్రెస్ నేతలే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సన్నబియ్యం బాగున్నాయా?

- విద్యార్థులకు రక్త పరీక్షలు చేయిస్తున్నారా?
- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి
- దేవరకొండ డివిజన్‌లో తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు

దేవరకొండ/కొండమల్లేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీచేస్తున్న సన్నబియ్యం బాగున్నాయా? విద్యార్థులకు రక్త పరీక్షలు చేయిస్తున్నారా? ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆరా తీశారు. మంగళవారం కొండమల్లేపల్లి, దేవరకొండ మండలాల్లో జాతీయ ఆహారభద్రత చట్టం అమలు తీరును కమిటీ సభ్యులు శారద, భారతి, జ్యోతి, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రేషన్ దుకాణం, దోన్యాలలోని అంగన్‌వాడీ కేంద్రం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కొండభీమనపల్లి మైనార్టీగురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, దేవరకొండ సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహం, ప్రభుత్వ ఆసుపత్రిని వారు తనిఖీచేశారు. కొండమల్లేపల్లి 3వ నెంబర్ చౌకధరల దుకాణాన్ని తనిఖీచేసి రేషన్‌బియ్యం సరఫరా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలన్నారు. తన దుకాణానికి ప్రతీ నెల 196 క్వింటాళ్ల బియ్యం దిగుమతి అవుతోందని, గతంలో ప్రజలకు పంపిణీ చేసేందుకు 15 రోజుల సమయం పట్టేదని, సన్నబియ్యం కావడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపి వస్తుండటంతో నాలుగు రోజులోనే పంపిణీ పూర్తవుతోందని డీలర్ వివరించారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారులతో కమిషన్ సభ్యులు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల వివరాలు, పౌష్టికాహారం, పాలు, గుడ్లు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి ఇక్కడ వెయ్యి మంది విద్యార్థులు విద్యనభ్యసించడం అభినందనీయమన్నారు. వంట గది, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. దేవరకొండ పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహన్ని తనిఖీ చేసి వసతి గృహ విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించాలన్నారు.

దేవరకొండలో ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల నుంచి 200 పడకలకు మార్చే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. దేవరకొండ గురుకులంలోనికి కొందరు ఆకతాయిలు రాత్రివేళ వచ్చి విద్యార్థులను భయాందోళనకు గురిచేశారనే సమాచారం ఉందని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిర్యాదుల పెట్టే నిర్వహణ తీరు సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. దోన్యాల అంగన్‌వాడీ కేంద్రంలో రుచికరంగా వంట చేయాలని సూచించారు. వారి వెంట డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, శిశుసంక్షేమశాఖ పీడీ కృష్ణవేణి, డీఈవో భిక్షపతి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి చక్రునాయక్, హరీష్, దేవరకొండ, కొండమల్లేపల్లి తహసీల్దార్ సంతోష్‌కిరణ్, అన్వర్ హుస్సేన్, ఎంపీడీవో డానియెల్, బాలరాజురెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఆహార కమిషన్‌కు కలెక్టర్ స్వాగతం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు శారద, భారతి, జ్యోతికి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో జిల్లాలో ఆహార భద్రతా కింద అమలవుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అంతా మోసపోయారు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



జెండా ఊపి పాదయాత్ర ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గుండకండ్ల జగదీష్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రైతులు, కూలీలు, కార్మికులు, మహిళలు అంతా మోసపోయారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం యాదాద్రి జిల్లా వలిగొండ మండలంలోని అరూరు గ్రామపరిధిలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు చేపట్టిన పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయాన్ని నాశనం చేసిందని, రైతులు ఏడుస్తున్నారని తెలిపారు. గాంధీ చూపిన అహింసా మార్గంలోనే తెలంగాణ ఉద్యమాన్ని నడిపి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనకిచ్చిన ఆర్టికల్ 3ను ఉపయోగించుకొని తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న నిరంహించ తలపెట్టిన సభ విజయవంతం కావాలని ఈ పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపడానికి విద్యార్థి, యువజన సంఘం నాయకులు ముందుకు రావడం అభినందీయనమన్నారు. వరంగల్ సభకు భారీ ఎత్తున తరలిరావాలన్నారు. పాదయాత్రలో బీఆర్ఎస్‌వై యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వల్లమాల్ల కృష్ణ, బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి బూరుగు నవీన్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఆస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురకంటి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, పసుమటి మమత-నరేందర్‌రెడ్డి, మట్ట దనుంజయ గౌడ్, జానీ అఫ్రోజ్, పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీపై తప్పుడు ప్రచారం చేస్తే కేసు నమోదు చేస్తాం

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నల్లగొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకంపై తప్పుడు ప్రచారం చేస్తే కేసు నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తి చౌకధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం బదులు ప్లాస్టిక్ బియ్యం సరఫరా చేస్తున్నారని వీడియోను సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విషయాన్ని గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకం చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న పోర్టిఫైడ్ సన్నబియ్యంపై ఎవరైనా నిరాధార ఆరోపణలు ప్రచారం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుంచి స్పందన ఉందని, ప్రజలందరూ సంతోషంగా సన్నబియ్యాన్ని తీసుకుంటున్నారని అన్నారు. ఈ పథకాన్ని నీరుగార్చేందుకు కొంతమంది సోషల్ మీడియాలో చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో సహించదన్నారు.

10 రోజుల్లో నిర్వాసితులకు పునరావాసం: ఆర్డీవో

మర్రిగూడ,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చర్లగూడ రిజర్వాయర్‌లో ముంపు బాధిత భూ నిర్వాసితులకు 10 రోజుల్లో పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పిస్తామని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలో ముంపు బాధితులతో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా రిజర్వాయర్ పనులు చేపడుతున్నందున్న 390మంది ఇళ్లను కోల్పోయారన్నారు. వారికి పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేస్తామని అన్నారు. ప్రస్తుతానికి పనులు జరగనివ్వాలని కోరారు. అనంతరం నిర్వాసితులతో తీర్మానం చేయించి వినతిపత్రం తీసుకున్నారని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో యరకల యాదయ్య, గుర్రం రజిత, పారిజాత, వల్లపు కేశవులు, శ్రీను, నిరంజన్, నర్సింహ, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి



ధర్నాలో మాట్లాడుతున్న పాలడుగు ప్రభావతి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఆరేళ్లుగా నిరుపేదలకు వితంతు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పెన్షన్ ఇవ్వడం లేదని, దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘాల సభ్యులకు ఇన్సూరెన్స్ సౌకర్యం లేకపోవడంతో సభ్యురాలు మృతిచెందితే ఆ భారం గ్రూప్ సభ్యులపై పడి సంఘాలు అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయన్నారు. ప్రభుత్వమే ప్రతీ మహిళకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. అర్హులైన పేదలు కొన్నేళ్లుగా దరఖాస్తు చేసుకున్నా రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదని,కనీసం చేర్పులు, మార్పులకు కూడా అవకాశం ఇవ్వడం లేదన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు, సన్న బియ్యం అందాలంటే రేషన్‌కార్డులు తప్పనిసరి చేశారని, అయితే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, నిమ్మల పద్మ, జిల్లా ఆఫీస్ బేరర్స్ భూతం అరుణకుమారి, తుమ్మలా పద్మ, సుల్తానా, ఊర్మిళ, అరుణ, ఇందిర, శశికళ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పోలీస్ అధికారులతో సమస్యల పరిష్కారం

ఎస్పీ శరత్‌చంద్రపవార్

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పోలీస్ అధికారుల సేవలతో ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేజ్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాల ఏర్పాటుతోనే నేరనియంత్రణ సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లోకి కొత్తగా వచ్చే అనుమానితుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలు విలేజ్ పోలీస్ అధికారికి అందించాలన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా గానీ, మెసేజ్ ద్వారా గానీ వ్యక్తిగత సమాచారం అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. యువత మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, మాదకద్రవ్యాల క్రయవిక్రయాలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రైతులకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



చిట్యాలలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిసాన్‌మోర్చా నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి

బీజేపీ కిసాన్‌మోర్చా నేత గోలి మధుసూదన్‌రెడ్డి

చిట్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతులకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నేత గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా సంపూర్ణంగా అమలు చేయాలని, అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫసల్‌బీమా పథకాన్ని అమలు చేయాలని, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు, గోనె సంచులు సరిపడా లేవన్నారు. లారీల సమస్య, హమాలీల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వెంటను రైతుల ఖాతాలో డబ్బు జమచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నాయకులు కన్నెబోయిన మహలింగం, గుడిగుంట్ల సాయన్న, మండల వెంకన్న, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, మిర్యాల వెంకన్న, అంశాల అనిల్‌కుమార్, జయారపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చింతపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని మదనాపురం లక్ష్మీన రసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో వేద బ్రాహ్మణులు స్వామివారికి నిత్య పూజలు, సుప్రభాత సేవ, తదితర పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. నేడు ఆలయంలో లక్ష్మీనర సింహ రథోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ దేరంగుల మహేష్, దేవదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు ఏకపాత్రాభినయ పోటీలు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం ఆధ్వర్యంలో ఏకపాత్రాభినయ పోటీలు నేడు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు తడకమళ్ల రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణ మూర్తి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రస్థాయి ఆహ్వాన ఏకపాత్ర, ఉమ్మడి జిల్లాస్థాయి పద్యనాటక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

వేగంగా 'ఉపాధి' పనులు

● వేములపల్లి మండలంలో 1,187 మంది కూలీల హాజరు ● రోజువారి గరిష్ఠ వేతనం రూ.307 ● పని భారంలో ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రస్తుత సీజన్‌లో పంట నూర్పిడి పనులు అయిపోతుండడంతో సరైన కూలీ దొరక్క గ్రామాల్లోని ప్రజలు ఉపాధి హామీ పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో మండలంలో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి. మండలంలోని మొల్కపట్నం, వేములపల్లి, సల్కునూరు, శెట్టిపాలెం, రావులపెంట, ఆమనగల్లు తదితర గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల జోరు కొనసాగుతుంది.

(ఆంధ్రజ్యోతి-వేములపల్లి)



ఉపాధి హామీ పథకంలో కొనసాగుతున్న పనులు

వేములపల్లి మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో 5,164 జాబ్ కార్డులుండగా 9,207 మంది ఉన్నారు. ఈ ఏడాది 1,79,861 పని దినాలు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. కూలీలకు గ్రామంలోని ఎఫ్‌ఏలు వారికి విడతలవారీగా పనులు చూపుతున్నారు. వీరిలో ప్రస్తుతం 1187 మంది కూలీలు పనికి హాజరవుతున్నారు. గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధిహామీ ద్వారా ఫిష్‌పాండ్, రోడ్డు పనులు కొనసాగుతున్నారు. కూలీలు ఉదయం 6గంటల నుంచి 12గంటల వ్యవధిలో నాలుగు గంటల మేర పనులు చేస్తున్నారు. కూలీలు నిర్ణీత కొలతల ప్రకారం నాలుగు గంటల వ్యవధిలో పని పూర్తి చేసినట్లయితే రోజువారీ గరిష్ఠ వేతనం రూ.307 పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో హాజరు నమోదు

ఉపాధిహామీ కూలీలు చేసే పనులను ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తమ ఫోన్‌లో ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) విధానంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో హాజరును నమోదు చేస్తున్నారు. కూలీలు పని ప్రదేశానికి చేరుకున్నాక మొదటి ఫొటో తీయగా పనులను ప్రారంభిస్తారు. అనంతరం నాలుగు గంటల వ్యవధి తర్వాత పనుల ముగింపు సమయంలో రెండో ఫొటోను ఎఫ్‌ఏలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో ఆ రోజు కూలీల హాజరు నమోదు పూర్తవుతుంది. అదేవిధంగా మస్టర్‌లో కూడా కూలీల సంతకాలను నమోదు చేస్తారు. కొన్నిసార్లు సర్వర్ బిజీతోపాటు సకాలంలో ఆన్‌లైన్ నమోదు చేయడం సాధ్యం కావడంలేదు. దీంతో కూలీ నాలుగు గంటలపాటు పనిచేసినా అతని హాజరు లెక్కలోకి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పనిభారంలో ఫీల్డ్ అసిస్టెంట్లు

ఎన్‌ఎంఎంఎస్ విధానంలో హాజరు నమోదు బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగించడంతో పనిభారంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. కూలీల సంఖ్యను బట్టి వివిధ ప్రదేశాల్లో వారికి పని కల్పిస్తారు. దీనిలో భాగంగా కూలీలు పని ప్రదేశానికి చేరుకోగానే పని ప్రారంభానికి ముందు ఎఫ్‌ఏలు ప్రతీ కూలీ ఆధార్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అప్పుడు మాత్రమే అతను తన పనిని ప్రారంభించాలి. ఈ సమయంలో సర్వర్ బిజీ ఉన్నా, సిగ్నల్ సరిగా లేకపోయినా అతని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో పని ప్రదేశంలో తీవ్ర జాప్యం కలుగుతుందని కూలీలు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఎఫ్‌ఏలు పేర్కొంటున్నారు. మరోవైపు తమ వద్ద మొబైల్స్ 2జీ, 4జీ మొబైల్స్ కావడంతో సిగ్నల్స్ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు.

పని ప్రదేశంలో కూలీలు నిబంధనల ప్రకారం నాలుగు గంటలు పనిచేసినప్పటికీ ఆన్‌లైన్ సమస్యతో హాజరు నమోదు కాకపోతే వారు చేసిన పని వృథా అవుతుందని, తమను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒక్కొక్కరు సుమారు 100 నుంచి 200 మంది కూలీల హాజరును పలు ప్రదేశాలకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి వస్తుండడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒత్తిడికి గురవుతున్నాం



ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ ఒక్కరే ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి రావడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాం. సకాలంలో ఆన్‌లైన్‌లో హాజరు వివరాలు నమోదు కాకపోతే కూలీ ఆరోజు పనిచేసినా వృథా అవుతుంది. గతంలో మాదిరిగా 50 నుంచి 100 మంది కూలీలకు ఒక సీనియర్ మేట్‌ను నియమించి వారికి ఆన్‌లైన్ హాజరు నమోదు వివరాలను అప్పగించాలి.

అంకెపాక జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం

ప్రతీ ఒక్కరికి పని కల్పిస్తాం

పనికోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ కూలీకి పని కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎన్‌ఎంఎంఎస్ విధానంలో హాజరు నమోదు చేయాల్సి రావడంతో సర్వర్ బిజీతోపాటు కూలీల నమోదు పెరుగుతుండడంతో ఎఫ్‌ఏలపై కొంత పనిభారం పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నాం.

మిరాజొద్దిన్, ఏపీవో

పూజల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్



పూజల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్ తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మండలంలోని అవంతీపురంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, సరస్వతి దేవీఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి టి.శరత్‌బాబు, అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం పట్టువస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరి బాబు, ఎంఈవో బాలునాయక్, ఆర్‌ఐ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు టి.సత్యనారాయణ, ఈవో రామచంద్రప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలతో మేథస్సు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఒలంపియాడ్ పరీక్షలతో విద్యార్థుల మేథస్సు పెరుగుతుందని ఆదిత్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి అన్నారు. ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ పరీక్షలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థి వీ. జైత్ర రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకు సాధించడం గర్వకారణమన్నారు. సైన్స్ విభాగంలో బీ.వెంకట్, ఎం. జశ్వన్‌లు ఎక్సలెన్సీ అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. లిటిల్ ఛాంప్, జూనియర్ కేజీ విభాగాల్లో జీ.సాధ్య, ఎన్.మహిత్, రియానుద్దీన్, నిధ్యశ్రీ గోల్డ్ మెడల్ సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా రాష్ట్రంలోని పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇళ్లలేని పేదలు ఎంతో మంది ఉన్నారని, వారందరికీ ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అదేవిధంగా యువతకు స్వయం ఉపాధికోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం, మహిళలకు ఆత్మీయ భరోసావంటి పథకాల్లో అర్హులైన వారిని ఎంపిక చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులు, పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం కల్పించాలని, అన్నిరకాల ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్ రెడ్డి, పుల్లెంల శ్రీకర్, పతాని శ్రీను, అయితగాని విష్ణు, జూకూరి నాగయ్య, ఊరుకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామాజికంగా, ఆర్థికంగా ముందుండాలి

● సీడీ రవికుమార్, మువ్వ అరుణ్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీ రవికుమార్

హాలియా, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): కమ్మ కులస్థులు సామాజికంగా, ఆర్థికంగా ముందుండాలని జడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మువ్వా అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం హాలియా కమ్మ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొని మాట్లాడారు. సంఘంలోని పేద వారిని ఆదుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. అనంతరం అనుముల మండల నూతన అధ్యక్షుడిగా రావిళ్ల చెన్నయ్య, కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా నారాయణరావు, పట్టణ అధ్యక్షుడిగా కోటా శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోటపాటి మధుబాబు, ఇతర కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి పేలపూడి బాలకృష్ణ సభాధ్యక్షుడిగా వ్యవహరించగా కార్యక్రమంలో చేకూరి హనుమంతరావు, బండార్ ప్రసాద్, కోడే సతీష్‌కుమార్, గోడపర్తి జానకి రామయ్య, పేలపోలు తిరుపతయ్య, వెంకటరమణ చౌదరి, సాధినేని శ్రీనివాసరావు, చెరుకూరు సుబ్రమణ్యం, మద్దుకూరి రాంబాబు, మేడిపల్లి మోహన్‌రావు, ఉన్నం చినవీరయ్య, రామకృష్ణ, రామ అవతారం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంగీత పోటీల్లో చిన్నారుల ప్రతిభ

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సంగీత పోటీల్లో పాములపాడు గ్రామానికి చెందిన అహరోన్, రిస్పాలు ప్రతిభచాటారు. మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన జువాజి ఆనంద్‌కుమార్ గౌతమిల కుమారుడు అహరోన్, కుమార్తె రిస్పాలు 2024 డిసెంబర్ 1న హల్లేల్ మ్యూజిక్ స్కూల్ వారు నిర్వహించిన ఆన్‌లైన్ సంగీత పోటీల్లో సంగీత కళాకారులు కీబోర్డు ప్లే చేసి ఒక గంటలో 1046 వీడియోలు అప్‌లోడ్ చేశారు. ప్రపంచస్థాయిలో జరిగిన మ్యూజిక్ ప్రదర్శనలో అహరోన్, రిస్పాలు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించగా, ఈ నెల 14న హైదరాబాద్‌లో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొని హల్లేల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాస్టర్ అగస్టీన్ దండింగి చేతుల మీదుగా బంగారు పతకం, సర్టిఫికెట్ అందుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



వంట సామగ్రి అందజేస్తున్న ఎంఈవో అంజయ్య

చింతపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంఈవో అంజయ్య తెలిపారు. మంగళవారం చింతపల్లి మండలంలోని 34 పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు విడుదల చేసిన వంట సామగ్రిని వీటీ నగర్ జడ్పీహెచ్‌ఎస్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల సంక్షేమానికి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి బోధించాలన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుటకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీటీనగర్ హెచ్‌ఎం కృష్ణవేణి, టీచర్లు ఎండీ అన్వర్, సుధీర్, పాల్వాయి వాసుదేవ్ రెడ్డి, పాల్గొన్నారు.

కోర్టులో మౌలిక వసతుల కల్పన



పనులను పరిశీలిస్తున్న కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత

దేవరకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కోర్టులో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అనిత తెలిపారు. మంగళవారం కోర్టు ఆవరణలో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. దేవరకొండ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నూతనంగా కోర్టు ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ మున్సిఫ్ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి హరీష్‌బాబు, మునిసిపల్ కమీషనర్ సుదర్శన్, ఏఈ రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమ మహేశ్వర్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, ఇంద్రవరప్రసాద్ రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సదస్సును విజయవంతం చేయాలి

● మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జానారెడ్డి

నాగార్జునసాగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన త్రిపురారం మండల కేంద్రంలో నిర్వహించే ఐఎన్‌టీయూసీ నాగార్జునసాగర్ నియోజకవర్గ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. సదస్సు కరపత్రాన్ని జానారెడ్డి మంగళవారం నాగార్జునసాగర్‌లో ఆవిష్కరించారు. సదస్సును విజయవంతం చేసేందుకు కార్మికులంతా భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్చిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

వేములపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువత పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్ అన్నారు. మంగళవారం మండలంలోని సల్కునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం రిజర్వేషన్లు తీసుకొచ్చిన మహనేత అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో తండు సైదులుగౌడ్, తిరుమలగిరి అశోక్, నాయిని భాస్కర్, అంజిగౌడ్, రాంబాబు, శ్రీనివాస్, క్రాంతి, ఉపేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చందంపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా పోలీసశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చందంపేట ఎస్‌ఐ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న పోలేపల్లి గ్రామంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి సకాలంలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

హాలియా,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా హాలియా మున్సిపాలిటీలోని బస్టాండ్‌లో మంగళవారం అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బస్టాండ్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించి అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అదే విధంగా అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హాలియా అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ఎమ్.ఎల్లయ్య, రమేష్, రాంరెడ్డి, గోవిందయ్య, నాగరాజు, రాము, మంగయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ, రైతుభరోసా అందించాలి

గుర్రంపోడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మే 5న జరిగే అఖిల భారత విప్లవ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, మోదీ పాలనలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్యుల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రుణమాఫీ చేయకుండా మోదీ రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఏ హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, అర్హులైన రైతులందరికీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బైరు సత్తయ్య, బుచ్చయ్య, అంజయ్య, లింగయ్య పాల్గొన్నారు.

జానాపై వ్యాఖ్యలు బాధాకరం

హాలియా, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో నీతి నిజాయితీ, నైతిక విలువలతో రాజకీయాలు సాగించిన సీఎల్‌పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిపై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు బాధాకరమని యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం జానారెడ్డి అహర్నిషలు కృషి చేశారన్నారు. 2009లో కాంగ్రెస్‌లో కనీసం సభ్యత్వం కూడా లేని రాజగోపాల్‌రెడ్డి భువనగిరి ఎంపీ అభ్యర్థిగా ప్రకటిస్తే అందరిని సమన్వయం చేసింది జానానేనన్నారు. ఇప్పటికైనా నోటికి ఏది వస్తే అది మాట్లాడడం మానుకోవాలన్నారు.

ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌కు నంది అవార్డు



నంది అవార్డు అందుకుంటున్న ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్

మాడ్గులపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కడం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ బొంగర్ల శ్రీనివాస్‌కు నంది అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం గద్దర్ కుమార్తె వెన్నెలక్క, జూపల్లి కృష్ణారావు, డాక్టర్ శ్రీనివాస్‌రాజుల చేతుల మీదుగా తాను నంది అవార్డు అందుకున్నట్లు తెలిపారు. 25 సంవత్సరాలకు పైగా తాను ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. ఈ విజయం వెనుక తన తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. రైల్వే అధికారులు రూరల్ పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్‌ఐ లక్ష్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందని, ఈ నెల 12న సికింద్రాబాద్ నుంచి కర్నాటక రాష్ట్రం సెరామ్‌కు ప్రయాణించేందుకు తీసుకున్న రైల్వే టికెట్ లభ్యమైందన్నారు. మూడు రోజుల క్రితమే అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్ర పరిచినట్లు తెలిపారు. వివరాల కోసం సెల్:8712670189, 871260151 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నలుగురు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ మధు

గుర్రంపోడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు గుర్రంపోడు ఎస్‌ఐ మధు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న మండలంలోని ఆరెగూడెం శివారులో గల తిరుమలనాథ స్వామి దేవాలయంలో హుండీ ధ్వంసంచేసి రూ.5వేలు దొంగిలించారని గ్రామానికి చెందిన మారం రాంరెడ్డి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తుండగా, మంగళవారం ఉదయం 6గంటల సమయంలో ఆమలూరు బస్‌స్టేజి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నలుగురు మూడు నెంబరుప్లేట్లు లేని బైక్‌లపై అనుమానాస్పదంగా వెళ్తుండగా వారిని పట్టుకున్నారు. కొప్పోలు గ్రామానికి చెందిన మామిడి వెంకటేష్, కొట్ర సాయిలతోపాటు ఇద్దరు మైనర్లు గత సంవత్సరకాలంగా కొప్పోలు, ఆరెగూడెం గ్రామశివారు ప్రాంతాల్లో నిలిపి ఉంచిన మూడు బైక్‌లను, తిరుమలనాథ స్వామి దేవాలయంలో హుండీ పగులగొట్టి నగదు దొంగిలించినట్లుగా ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.1.53లక్షల విలువైన మూడు బైక్‌లు, రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ మధు, సిబ్బంది కావలి నర్సింహ, నాగరాజు, సత్యనారాయణ, సైదులును దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఇన్‌చార్జి సీఐ రాజు అభినందించారు.

సమతుల ఆహారంతోనే ఆరోగ్య రక్ష





వేములపల్లిలో సీమంతం చేస్తున్న అధికారులు, చింతపల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో సక్కుబాయి

వేములపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సీడీపీవో చంద్రకళ అన్నారు. మంగళవారం మండలంలోని వేములపల్లి హైస్కూల్లో నిర్వహించిన పోషణపక్ష వారోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, బాలల హక్కులు, బాల్య వివాహాలవల్ల జరిగే నష్టాలను ఆమె వారికి వివరించారు. ప్రతీరోజు భోజనంలో చిరుధాన్యాలు, పప్పు, పాలు, బెల్లం, గుడ్లు, ఆకుకూరలు వంటివి తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం నిర్వహించగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధాకర్, హెల్త్ సూపర్‌వైజర్ శాంత, ఏపీఎం నిజాముద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పరిమి రజిని, జె.నాగమణి, ఏఎన్‌ఎం శైలజ, కవిత పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి : సక్కుబాయి

చింతపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులతోపాటు బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయి తెలిపారు. మంగళవారం చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల రెండో అంగన్‌వాడీకేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమంలో మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పెరుగుదలతోపాటు బరువు, ఎత్తు, కొలతలు రికార్డులో నమోదు చేయాలని ఆమె కోరారు. టీచర్లందరూ సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుగుణ టీచర్లు యాదమ్మ, బాదేపల్లి స్వప్న, తదితరులు పాల్గొన్నారు.